# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక :330 ఆదివారం 2-8-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/




# 18 నిమిషాలకో రేప్!

- దేశంలో ఆడబిడ్డలకు కరువైన కనీస భద్రత
- 2024లో దేశవ్యాప్తంగా 29,536 రేప్ కేసులు
- టాప్-5లో ఉన్నవన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాలే
- మొత్తంగా మహిళలపై 4,41,534 నేరాలు

**న్యూఢిల్లీఆగస్టు 01 (జర్నలిస్ట్ డైరీ) :** 'బేటీ బచావో..' అంటూ నినాదమిచ్చిన బీజేపీ ప్రభుత్వ పాలనలో అడబిడ్డలకు భద్రత కరువయ్యింది. దేశంలో ప్రతీ 18 నిమిషాలకు ఒక రేప్ కేసు నమోదవుతున్నది. మహిళలపై జరిగే లైంగిక దాడుల్లో బీజేపీపాలిత రాష్ట్రాలే టాప్-5 స్థానాల్లో ఉన్నాయి. మొత్తంగా సగటున రోజుకు 1,210 -మిగతా 2 లో





# అమెరికా వీసా బాంబ్

- వాణిజ్య, టూరిస్టు వీసాలకు బాండ్ ప్రోగ్రామ్
- 20 వేల డాలర్లు చెల్లిస్తేనే వీసాలు
- 50 దేశాలకు ట్రంప్ సర్కార్ షాక్
- గడువు ముగిసేలోగా అమెరికా విడిచివెళ్లాలి
- లేదంటే బాండ్ డిపాజిట్ ఫ్రీజ్
- రేపటి నుంచి అమల్లోకి

2



## తల్లి పాలే శిశువుకు
# తొలి టీకా


- ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలి
- పుట్టిన గంటలోనే తల్లిపాలు ప్రారంభించాలి
- తొలి ఆరు నెలలు తల్లిపాలే ఇవ్వాలి
- అంగన్వాడీ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు విస్తృత అవగాహన కల్పించాలి
- మంత్రి సీతక్క

**హైదరాబాద్ ఆగస్టు 01 (జర్నలిస్ట్ డైరీ) :** ప్రపంచ తల్లి పాల వారోత్సవాల (ఆగస్టు 1--7) సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి తల్లి, ప్రతి కుటుంబానికి తల్లిపాల ప్రాముఖ్యతను చేరవేయ్యాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. తల్లి పాలు ప్రతి శిశువుకు తొలి హక్కు, ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ పోషకాహారమని మంత్రి పేర్కొన్నారు. పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు శిశువుకు తొలి రోగనిరోధక టీకాలా పనిచేస్తాయని తెలిపారు. ప్రతి శిశువుకు పుట్టిన గంటలోనే తల్లిపాలను ప్రారంభించడం, తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వడం, అనంతరం -మిగతా 2 లో

## ధరణి అక్రమాలపై
# ఉక్కుపాదం

### అక్రమాల బట్టబయలుకు ఫాస్ట్‌ట్రాక్ విచారణ

- పేదల భూములు కాజేసిన వారిని వదిలిపెట్టం
- భూముల ధరల సవరణతో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల ఆదాయం 20 శాతం వరకు పెరుగుదల
- త్వరలో అసైన్డ్ భూములపై సమగ్ర విధాన నిర్ణయం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ ఆగస్టు 01 (జర్నలిస్ట్ డైరీ) :** ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని పేదల భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ఒ పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారిస్తున్నామని, అక్రమాలకు పాల్పడిన వారెవరైనా చట్టం ముందు నిలబెట్టడం ఖాయమని హెచ్చరించారు. శనివారం డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌ను అడ్డుగా చేసుకుని -మిగతా 2 లో



# చట్టంగా మారిన యాంటీ పేపర్ లీక్ బిల్లు

- పార్లమెంట్ ఆమోదం.. రాష్ట్రపతి గ్రీన్‌సిగ్నల్
- నీట్ వివాదం తర్వాత కేంద్రం కీలక నిర్ణయం
- ప్రతి రాష్ట్రంలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు
- పేపర్ లీకేజీకి రూ.50 లక్షల వరకు జరిమానా
- సంస్థలకు రూ.10 కోట్ల వరకు భారీ ఫైన్
- 5 నుంచి 10 ఏళ్ల వరకు జైలు శిక్ష
- రెండు నెలల్లో దర్యాప్తు.. ఎస్‌టీఎఫ్‌కు బాధ్యత

2

## పన్నుల వాటా కింద
# రూ.1.09 లక్షల కోట్ల విడుదల



- ఏపీకి రూ.4,597 కోట్లు.. తెలంగాణకు రూ.2,370 కోట్లు
- గడువుకు ముందే నిధుల విడుదల చేసిన కేంద్రం
- అభివృద్ధి, మూలధన పనులకు ఊతం
- యూపీకి అత్యధికంగా రూ.19,208 కోట్లు
- రాష్ట్రాల ఆర్థిక బలోపేతమే లక్ష్యమన్న కేంద్రం
- నిధుల కొరత లేకుండా ముందస్తు చర్యలు
- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఊరట

2

# నేడు లష్కర్ బోనాలు..



2

- ఉజ్జయినీ మహంకాళి జాతరకు భారీ ఏర్పాట్లు
- ఉదయం 3.30 గంటలకు ప్రభుత్వ బోనం సమర్పణ
- భక్తుల దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు
- బోనాలు సమర్పించే మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు
- వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక కేంద్రాలు
- భద్రతా విధుల్లో 1500 మంది పోలీసులు
- అంబారీపై అమ్మవారి ఊరేగింపుతో ముగింపు వేడుకలు

## నల్ల చెరువు పునరుజ్జీవంలో
# హైడ్రా శ్రమ

### హైడ్రా అధికారులకు సీఎం రేవంత్ అభినందనలు



- చెరువుల సంరక్షణతో హైదరాబాద్‌కు కొత్త రూపు
- భావితరాల కోసం జలవనరుల పరిరక్షణ
- ప్రజల ఆస్తుల రక్షణకు ప్రభుత్వం కట్టుబాటు
- అభివృద్ధిలో తెలంగాణ కొత్త శిఖరాలు
- తలసరి ఆదాయంలో రూ.38,900 పెరుగుదల
- మహిళలు, రైతులు, యువతకు అభివృద్ధి ఫలాలు
- అత్యుత్తమ పనితీరును ప్రదర్శిస్తోన్న రాష్ట్రం..సీఎం రేవంత్‌రెడ్డి ట్వీట్

**హైదరాబాద్ ఆగస్టు 01 (జర్నలిస్ట్ డైరీ) :** ఉప్పల్ నల్ల చెరువు పునరుజ్జీవానికి హైడ్రా అహర్నిశలు శ్రమించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా హైడ్రా అధికారులకు, సిబ్బందికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈమేరకు శనివారం ట్వీట్ చేశారు. చెరువుల పునరుజ్జీవంతో రూపురేఖలు మారుతున్న హైదరాబాద్‌ను చూడటం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. క్యూర్ పరిధిని క్యూర్ చేసుకుంటూ... మన చెరువులకు జీవం పోస్తూ... జీవంతో నిండిన భవిష్యత్తును భావి తరాలకు హైడ్రా అంకితం చేస్తోందని తెలిపారు. చెరువులను పరిరక్షించడం అంటే కేవలం నీటి వనరులను కాపాడటం మాత్రమే కాదనీ, భావి తరాల భవిష్యత్తును భద్రపరచడం కూడా -మిగతా 2 లో



# ఇండో-చైనా సరిహద్దు వాణిజ్యం షురూ

- నాథూలా పాస్ ద్వారా పునఃప్రారంభం
- ఆరు సంవత్సరాల తర్వాత సిక్కింలో మొదలు
- నవంబర్ వరకు సరుకుల రాకపోకలు
- 38 మంది వ్యాపారులకు పాస్లు జారీ
- రెడీమేడ్ వస్త్రాలు సహా 36 ఉత్పత్తుల వాణిజ్యం
- ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ భద్రతా ఏర్పాట్లు
- తొలిసారిగా రంగంలోకి మహిళా ప్లాటూన్
- 40 ఏళ్లు మూసివేత.. 2006లో పునఃప్రారంభం
- ఒక్కోక్క వ్యాపారికి రోజుకు రూ. 2 లక్షల వ్యాపారం
- 600 మంది వ్యాపారులకు జీవనోపాధి

**న్యూఢిల్లీ/ ఆగస్టు 01 (జర్నలిస్ట్ డైరీ) :** ఆరు సంవత్సరాల విరామం తర్వాత భారతదేశం చైనా మధ్య సిక్కింలోని నాథు లా పాస్ ద్వారా సరిహద్దు వాణిజ్యం శనివారం పునఃప్రారంభమైంది. ఇది పురాతన సిల్క్ రూట్ లోని ఒక ముఖ్యమైన శాఖను తిరిగ తెరిచినట్లు అవుతుంది. కోవిడ్ 19 మహమ్మారి, సరిహద్దు ఉద్రిక్తతల కారణంగా 2020 నుంచి ఈ మార్గం ద్వారా వాణిజ్యం నిలిచిపోయింది. ఈ పునఃప్రారంభం రెండు దేశాల మధ్య దౌత్యపాక్షిక సంబంధాల సాధారణీకరణకు ఒక సానుకూల సంకేతంగా చూడబడుతోంది. తూర్పుసిక్కింలోని నాథు లా వద్ద అధికారిక పునఃప్రారంభ -మిగతా 2 లో

# పోలీస్ రిక్రూట్మెంట్ దరఖాస్తు తేదీల ఖరారు

- 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి
- ఆధార్, ఫేస్ అథెంటికేషన్ తప్పనిసరి
- 19 నుంచి పోలీస్ నియామకాలకు దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్ ఆగస్టు 01 (జర్నలిస్ట్ డైరీ) :** రాష్ట్రంలో పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పిఎఫ్), అగ్నిమాపక శాఖ, జైళ్ల శాఖల్లో ఖాళీగా ఉన్న 7,437 పోస్టుల భర్తీ ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టిఎస్ఎల్‌పిఆర్‌బి) చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు శనివారం ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు షెడ్యూల్ ప్రకటించారు. అభ్యర్థులు ఈ నెల 19 నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకు -మిగతా 2 లో

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# 18 నిమిషాలకో రేప్!

(మొదటి తరువాయి)



మంది మహిళలపై నేరాలు చోటు చేసుకొంటున్నాయి. ఈ మేరకు ఇటీవల విడుదలైన జాతీయ నేర గణాంక విభాగం (ఎన్సీఆర్బీ-2024) నివేదిక కీలక విషయాల్ని వెల్లడించింది

మహిళలకు భద్రత ఎక్కడ?

ఎక్కడైతే మహిళలు గౌరవించబడతారో అక్కడ దేవతలు విహరిస్తారని అంటారు. అయితే, బీజేపీ పాలనలో దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది. 2024 ఒక్క ఏడాదిలోనే దేశవ్యాప్తంగా 4,41,534 మంది మహిళలపై దాడులు, అఘాయిత్యాలు జరిగాయి. మహిళలపై నేరాల్లో బీజేపీపాలిత రాష్ట్రాలు టాప్-3 స్థానాల్లో ఉండటం గమనార్హం. 66,396 కేసులతో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో ఉండగా, 47,954 కేసులతో మహారాష్ట్ర రెండో స్థానంలో, 36,536 కేసులతో రాజస్థాన్ మూడో స్థానంలో నిలిచింది. మహిళలపై నేరాల్లో హత్యలు, లైంగిక దాడులు, లైంగిక వేధింపులు, కిడ్నాప్‌లు, గృహహింస, వరకట్న వేధింపులు తదితరాలు ప్రధానంగా ఉన్నాయి.

బీజేపీపాలిత రాష్ట్రాలే టాప్

దేశంలో 2024 ఏడాదిలో మొత్తంగా 29,536 రేప్ కేసులు నమోదయ్యాయి. మహిళలపై లైంగిక దాడుల్లో బీజేపీపాలిత రాష్ట్రాలే టాప్-5 స్థానాల్లో ఉన్నాయి. రాజస్థాన్‌లో అత్యధికంగా 4,871 రేప్ కేసులు నమోదుకాగా, తర్వాతి స్థానాల్లో వరుసగా ఉత్తరప్రదేశ్ (3,209), మహారాష్ట్ర (3,091), మధ్యప్రదేశ్ (3,061), హర్యానా (1,391) ఉన్నాయి.

తెలిసినవారే కారకులు

మహిళలపై జరిగే ప్రతీ 100 లైంగిక దాడుల్లో 97 కేసుల్లో నిందితులు బాధిత మహిళకు తెలిసిన వారే ఉంటున్నారని ఎన్సీఆర్బీ నివేదిక తెలిపింది. 2024లో నమోదైన మొత్తం 29,536 రేప్ కేసుల్లో 28,597 కేసుల్లోని నిందితులు బాధితురాళ్లకు తెలిసినవారుగా ఉన్నట్టు వెల్లడించింది. ఘాతుకానికి పాల్పడిన వారిలో 2,134 కేసుల్లో కుటుంబసభ్యులు, 13,879 కేసుల్లో స్నేహితులు, మాజీ భర్తలు, 12,584 కేసుల్లో ఫ్యామిలీ ఫ్రెండ్స్, ఇరుగుపొరుగు, సహోద్యోగులు ఉన్నట్టు తెలిసింది.

2024లో మహిళలపై నేరాలు ఇలా..

మొత్తం నేరాలు: 4,41,534
భర్త, అత్తింటివారి వేధింపులు: 1,20,227
కిడ్నాప్‌లు: 67,829
పోక్సో కేసులు: 67,809
లైంగిక వేధింపులు: 48,303
రేప్‌లు: 29,536
ఇతర నేరాలు: 1,07,830

## తల్లి పాలే శిశువుకు తొలి టీకా

(మొదటి తరువాయి)

వయస్సుకు తగిన అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని మంత్రి చెప్పారు.

తల్లి పాల వారోత్సవాలను కేవలం అధికారిక కార్యక్రమాలుగా కాకుండా ప్రజల్లో చైతన్యం కలిగించే ఉద్యమంగా నిర్వహించాలని మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, గ్రామాలు, వార్డుల్లో అవగాహన సమావేశాలు, ఇంటింటి సందర్శనలు, కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించి తల్లిపాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు.

అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్లు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి గర్భిణీలు, బాలింతలు, ఆరు నెలల లోపు శిశువుల తల్లులు, రెండేళ్ల లోపు పిల్లల తల్లులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాలని మంత్రి సూచించారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగిస్తూ శాస్త్రీయ అవగాహన కల్పించాలని, కుటుంబ సభ్యులను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని కోరారు. ప్రసవం జరిగిన ప్రతి ఆసుపత్రిలో పుట్టిన గంటలోనే శిశువుకు తల్లిపాలు అందేలా వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. తల్లి పాల ప్రోత్సాహంలో అంగన్వాడీ వ్యవస్థ కీలక పాత్ర పోషించాలని, ప్రతి అంగన్వాడీ కేంద్రం తల్లి శిశు ఆరోగ్యానికి మార్గదర్శక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు.

పోషకాహార లోపం లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి శిశువుకు ఆరోగ్యవంతమైన జీవితానికి తల్లి పాలే బలమైన పునాది అని అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయడంలో ప్రజాప్రతినిధులు, వైద్యులు, మహిళా సంఘాలు, అంగన్వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ప్రతి కుటుంబం భాగస్వాములు కావాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించేలా సమాజమంతా బాధ్యతతో ముందుకు రావాలని కోరారు.

## చట్టంగా మారిన యాంటీ పేపర్ లీక్ బిల్లు

న్యూఢిల్లీ/



దేశంలో పేపర్ లీకేజీలను అరికట్టేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ అమెండ్‌మెంట్ బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ఆమోదించారు. దీంతో ఇకపై ఈ బిల్లు చట్టంగా అమలులోకి రానుంది. 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్, 2026' పేరుతో రూపొందిన ఈ బిల్లును ఈ వారంలోనే పార్లమెంట్ ఆమోదించింది. అటు లోక్‌సభలో చర్చ అనంతరం ఆమోదం పొందగా, మరుసటి రోజు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. దీంతో వెంటనే ఈ బిల్లు ఆమోదం కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వద్దకు పంపింది ప్రభుత్వం.ఇటీవల నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా సీజేపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ఆందోళన గురించి తెలిసిందే. ఈ ఉద్యమం నేపథ్యంలో కేంద్రం పేపర్ లీకేజీలను అరికట్టేలా కొత్త బిల్లును తీసుకొచ్చింది. ఇదే అంశంలో 2024లో తెచ్చిన బిల్లుకు సవరణలు తెస్తూ కొత్త బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లును కాంగ్రెస్ సహా అనేక ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఈ బిల్లు ద్వారా పూర్తిస్థాయిలో పేపర్ లీకేజీలను అరికట్టలేమని ప్ర తిపక్షాలు వ్యాఖ్యానించాయి. అయితే, పేపర్ లీకేజీలను అడ్డుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందువల్లే కొత్త బిల్లును రూపొందించామని కేంద్రం సమర్థించుకుంది. కొత్త బిల్లు ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడితే కఠిన శిక్షలు, జరిమానాలు విధిస్తారు. ఈ బిల్లులోని ప్రధానాంశాలివి. పేపర్ లీకేజీ కేసులను విచారించేందుకు ప్రతి రాష్ట్రంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తారు. 90 రోజుల్లోనే విచారణ పూర్తి చేసి, శిక్షలు విధించేలా ఈ కోర్టులు నిరంతరం పని చేస్తాయి. పాత బిల్లు ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడితే వ్యక్తిగతంగా రూ.10 లక్షల వరకు జరిమానా విధించేవారు. కొత్త బిల్లు ప్రకారం రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. ఒకవేళ సంస్థలు, వ్యవస్థీకృతంగా నేరానికి పాల్పడితే రూ.10 కోట్ల వరకు జరిమానా విధిస్తారు. అలాగే, గతంలో గరిష్టంగా మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు శిక్ష విధించేవారు. ఇప్పుడు ఐదు నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. ఇంతకుముందు కేంద్ర దర్యాప్తు సంస్థలు పేపర్ లీకేజీ కేసులపై విచారణ జరిపేది. కానీ, ఇకపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలు ఈ కేసుల్ని విచారిస్తాయి. గతంలో పేపర్ లీకేజీ కేసుల విచారణకు కాల పరిమితి అంటూ లేదు. కొత్త బిల్లు ప్రకారం ఈ కేసుల విచారణను రెండు నెలల్లో పూర్తి చేయాలి.

# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

(మొదటి తరువాయి)

భారీ స్థాయిలో భూ అక్రమాలు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని అన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యవహారాన్ని ఆధారాలతో సహా పరిశీలిస్తున్నామని, నిజాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. అంతేగాక ఎవరి హయాంలో ఎంత భూమి నిషేధిత జాబితాలో చేరిందో తేలుస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పుడు నిషేధిత జాబితాలో ఎంత భూమి ఉంది? ఆ భూములను ఎవరు, ఎప్పుడు, ఏ కారణాలతో చేర్చారు? తర్వాత ఎందుకు తొలగించారు? అనే ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కూడా అదే స్థాయిలో పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు. కొత్తగా ఒక్క సెంటు భూమి కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ధరణి పోర్టల్‌లో ఉన్న జాబితానే కోర్టుకు సమర్పించామని, వివాదాలు లేని ప్రైవేట్ ఆస్తులు లేదా ప్లాట్లను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు.

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, ప్రతి సర్వే నంబరుకు ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయిస్తామని చెప్పారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, కేవలం రెండు శాతం మాత్రమే అభ్యంతరాలు వచ్చాయని వివరించారు. రాష్ట్రంలో సుమారు 85 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటి విషయంలో సమగ్ర విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కోణాల్లో ప్రభుత్వం చర్చిస్తోందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండేదని, ఎవరికీ అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరించే ప్రశ్నే లేదని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే ప్రతి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. క్యూఆర్ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్లను చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. కొల్లాపూర్ లో గత ప్రభుత్వం నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లలో వర్షం వస్తే నీళ్లు కారుతున్నాయని మీడియా దృష్టికి వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అది గత ప్రభుత్వ నాణ్యతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఇళ్లను కూడా మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే ఫైనల్ బిల్లులు చెల్లిస్తుందని మంత్రి ప్రకటించారు. భూముల మార్కెట్ విలువల సవరణ తర్వాత ప్రభుత్వం అంచనా వేసిన దానికంటే 10 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం వచ్చిందని మంత్రి తెలిపారు. స్టాంప్స్ & రిజిస్ట్రేషన్స్ శాఖ ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు వార్షిక ఆదాయం సుమారు రూ. 13 వేల కోట్లు ఉండగా, గత ఏడాది అది రూ. 15 వేల కోట్లకు చేరిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 18 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు.

# అమెరికా వీసా బాంబ్

- వాణిజ్య, టూరిస్టు వీసాలకు బాండ్ ప్రోగ్రామ్
- 20 వేల డాలర్లు చెల్లిస్తేనే వీసాలు
- 50 దేశాలకు ట్రంప్ సర్కార్ షాక్
- గడువు ముగిసేలోగా అమెరికా విడిచివెళ్లాలి
- లేదంటే బాండ్ డిపాజిట్ ఫ్రీజ్
- రేపటి నుంచి అమల్లోకి



వాషింగ్టన్:

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ మరో పిడుగులాంటి వార్త చెప్పారు. తాజాగా 50 దేశాలపై వీసా బాండ్ బాంబ్ పేల్చారు. వ్యాపారం కోసం ఇచ్చే బీ-1, టూరిస్టులకు జారీ చేసే బీ-2 వీసాల జారీకి శాశ్వత వీసా బాండ్ ప్రోగ్రామ్‌ను ట్రంప్ యంత్రాంగం తీసుకువచ్చింది. దీని కింద ఆయాదేశాలకు చెందిన పర్యాటకులు 20 వేల డాలర్ల బాండ్ సమర్పించాల్సి ఉంటుంది. యూఎస్ వీసాబాండ్ ప్రోగ్రామ్ ముందుగా పైలట్ కార్యక్రమంగా ప్రారంభమైంది. తాజాగా అమెరికా ప్రభుత్వం దీనికి కొన్ని మార్పులు చేసి విస్తృత స్థాయిలో అమల్లోకి తీసుకువస్తోంది.

50 దేశాల నుంచి వ్యాపారం, టూరిజం వంటి పనుల కోసం వచ్చే సందర్శకులు ముందు కొంత మొత్తాన్ని డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. కొత్త నిబంధనలు ఆగస్టు 3 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ ప్రోగ్రామ్ వల్ల వీసా గడువు ముగిసినా దేశంలోనే ఉండేవారి సంఖ్య గణనీయంగా తగ్గుతుందని విదేశాంగ శాఖ తెలిపింది. దీనిని శాశ్వతంగా అమలు చేయాలని నిర్ణయించారు. ఫెడరల్ రిజిస్టర్ నోటీస్ ప్రకారం పైలట్ ప్రోగ్రామ్ కింద ఎంపిక చేసిన దరఖాస్తుదారులు బాండ్ రూపంలో డిపాజిట్ చేస్తే మొత్తం 5వేల డాలర్లు, 10 వేల డాలర్లు, గరిష్టం మొత్తం 15 వేల డాలర్లుగా ఉంది. తుది నిబంధనల్లో 5వేల డాలర్ల ఆప్షన్ తొలగించారు. గరిష్ఠ మొత్తాన్ని 20 వేల డాలర్లకు పెంచారు. వీసా ఓవర్ స్టే ఎక్కువ ఉన్న 50 దేశాల పౌరులకు ఈనిబంధనలు వర్తిస్తాయి. ఈ జాబితాలో ఆఫ్రికా, ఆసియా, దక్షిణ అమెరికా దేశాలు ఉన్నాయి. ఈ బాండ్ పరిధిలోకి వచ్చే ప్రయాణికులు కేవలం కమర్షియల్ విమానాల్లోనే ప్రయాణించాల్సి ఉంటుంది. వీసా తిరస్కరణకు గురైతే నిర్దేశిత గడువులోగా అమెరికాలో పనులు ముగించుకుని వెళ్లిన సమయంలో ఈ బాండ్ మొత్తం రీఫండ్ అవుతుంది. వీసా గడువు దాటినా అక్కడే ఉంటే ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఫ్రీజ్ చేస్తుంది.

# నేడు లష్కర్ బోనాలు..

**నేడు లష్కర్ బోనాలు.. రేపు రంగం**
- **ఉజ్జయినీ మహంకాళి జాతరకు భారీ ఏర్పాట్లు**
- **ఉదయం 3.30 గంటలకు ప్రభుత్వ బోనం సమర్పణ**
- **భక్తుల దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు**
- **బోనాలు సమర్పించే మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు**
- **వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక కేంద్రాలు**
- **భద్రతా విధుల్లో 1500 మంది పోలీసులు**
- **అంబారీపై అమ్మవారి ఊరేగింపుతో ముగింపు వేడుకలు**



బేగంపేట్,

: సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆగస్టు 2 ఆదివారం అమ్మవారికి బోనాలు, 3న రంగం, అంబారీపై అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం తరఫున ఉదయం 3.30 అమ్మవారికి బోనం సమర్పించిన అనంతరం 4 గంటల నుంచి భక్తులు దర్శించుకునేందుకు, బోనాలు సమర్పించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే సాధారణ భక్తులకు మూడు క్యూలైన్‌లు, అలాగే బోనాల సమర్పించే మహిళలకు వేరుగా 2 క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. అలాగే వీఐపీ లకు కూడా మరో క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక సెంటర్లను ఏర్పాటు చేశారు. బందోబస్తులో సుమారు 15 వందల మంది పాల్గొంటున్నట్టు పోలీస్ అధికారులు తెలిపారు.

## నల్ల చెరువు పునరుజ్జీవంలో హైడ్రా శ్రమ

(మొదటి తరువాయి)

అని పేర్కొన్నారు. ప్రతి చెరువును కాపాడుతూ... ప్రజల ఆస్తిని సంరక్షిస్తూ ముందుకు సాగుతామని ఆయన భరోసా ఇచ్చారు. కొత్త శిఖరాలను అధిరోహిస్తున్న తెలంగాణరాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ కొత్త శిఖరాలను అధిరోహిస్తూ సరికొత్త విజయాలను సాధిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమ పని తీరును ప్రదర్శిస్తోందని ట్వీట్ ద్వారా తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో తలసరి ఆదాయం రూ. 4,18,931గా నమోదయ్యిందనీ, ఇది గతేడాది రూ. 3,80,031గా ఉందని గుర్తు చేశారు. ఒకే సంవత్సరంలో తాము 10.23 శాతం వృద్ధిని సాధించామనీ, ఇది రూ. 38,900 పెరుగుదల అని తెలిపారు. కఠోర శ్రమ, ఆర్థిక వృద్ధిపై దృష్టి, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, అన్ని రంగాలలో సమతుల్య అభివృద్ధి, తాత్కాలిక విధానాల నుంచి విధాన ఆధారిత పాలనకు మారడం, శ్రద్ధతో కూడిన పని, నిరంతర సమీక్షలు, వివరాలపై శ్రద్ధ, భాగస్వాములతో నిరంతరం సంప్రదింపులు చేయడం ద్వారా ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం... గత దశాబ్దకాలపు వైఫల్య పాలనను, నిరాశావాద వాతావరణాన్ని తిప్పికొట్టి, ప్రతి పౌరునిలో ఆశావాదాన్ని, నమ్మకాన్ని నింపిందని వివరించారు. తమ విజయానికి మహిళలు, రైతులు, యువత అతిపెద్ద లబ్దిదారులని తెలిపారు. రాబోయే కాలంలో రాష్ట్రం మరింత గొప్ప విజయాలను సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## పోలీస్ రిక్రూట్మెంట్ దరఖాస్తు తేదీల ఖరారు


(మొదటి తరువాయి)

ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గత నెల 29న విడుదల చేసిన నాలుగు వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా మొత్తం 7,437 పోస్టులను భర్తీ చేయనున్నామని, దరఖాస్తులు కేవలం అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే స్వీకరించబడతాయని, ఇతర మార్గాల్లో వచ్చిన దరఖాస్తులను తిరస్కరిస్తామని స్పష్టం చేశారు. సివిల్, రిజర్వ్, ఎస్‌పిఎఫ్ ఎస్సై, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, డిప్యూటీ జైలర్ పోస్టులకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750, ఇతర అభ్యర్థులకు రూ.1,500 ఫీజు నిర్ణయించారు. అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఫింగర్ ప్రింట్ బ్యూరో) పోస్టులకు కూడా ఇదే ఫీజు వర్తిస్తుంది. ఈ పోస్టులకు ప్రత్యేక సాంకేతిక పరీక్ష నిర్వహిస్తారు. సివిల్, ఎఆర్, ఎస్‌ఆర్‌సిపిఎల్ పోలీస్ కానిస్టేబుల్, ఎస్‌పిఎఫ్ కానిస్టేబుల్, ఫైర్ ఫైటర్, జైలు వార్డర్ పోస్టులకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600, ఇతరులకు రూ.1,200 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పోలీస్ కానిస్టేబుల్ డ్రైవర్, మెకానిక్ పోస్టులకు కూడా ఇదే ఫీజు వర్తిస్తుంది. అయితే వీరికి అదనంగా డ్రైవింగ్ టెస్ట్ లేదా ట్రేడ్ టెస్ట్ నిర్వహిస్తారు.ఒక అభ్యర్థి ఒకటి కంటే ఎక్కువ నోటిఫికేషన్లు లేదా పోస్టులకు దరఖాస్తు చేసినా, శారీరక కొలతలు (పిఎంటీ), శారీరక సామర్థ్య పరీక్ష (పిఇటి) ఒక్కసారి మాత్రమే నిర్వహిస్తారు. ఆ పరీక్షల ఫలితాలను అభ్యర్థి దరఖాస్తు చేసిన అన్ని పోస్టులకు వర్తింపజేస్తారు. అదేవిధంగా ఒకటి కంటే ఎక్కువ కామన్ ప్రొసీజర్ రెజిమెంట్లకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఫీజులో రాయితీ కూడా కల్పించారు. ఓసి, బిసి అభ్యర్థులకు ప్రతి అదనపు రెజిమెంట్‌పై రూ.100, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.50 చొప్పున తగ్గింపు లభిస్తుంది.

ఆధార్ ఫేస్ అథెంటికేషన్ తప్పనిసరి దరఖాస్తు చేసుకునే ముందు అభ్యర్థులు తమ మొబైల్ ఫోన్లలో ఆధార్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఫేస్ అథెంటికేషన్‌కు సిద్ధంగా ఉండాలని టిఎస్ఎల్‌పిఆర్‌బి సూచించింది. దరఖాస్తు అనంతరం ప్రింట్ కాపీని భద్రపరుచుకోవాలని తెలిపింది.

## పన్నుల వాటా కింద రూ.1.09 లక్షల కోట్ల విడుదల

న్యూఢిల్లీ,



రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం, మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధి పనులకు కేంద్రం నిధులు విడుదల చేసింది. పన్నుల వాటా కింద రాష్ట్రాలకు నిధులను కేటాయించింది. మొత్తం రూ. 1,09,019 కోట్లను విడుదల చేసింది. మూలధన, అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు ముందస్తుగా నిధుల విడుదల చేసినట్లుగా వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌కి రూ. 4597 కోట్లను, తెలంగాణకు రూ. 2,370 కోట్ల నిధులు విడుదల అయ్యాయి. అత్యధికంగా యూపీకి రూ. 19,208 కోట్లు, బీహార్‌కి రూ. 10,845 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రాల ఆర్థిక స్థితిని మరింత బలపరిచేందుకు.. మౌలిక వసతులు, అభివృద్ధి పనులకు నిధుల కొరత రాకుండా చూసేందుకు రాష్ట్రాలకు ఈ నిధులు విడుదల చేసినట్లుగా వెల్లడించింది. పన్నుల వాటా కింద రాష్ట్రాలకు రూ. 1,09,019 కోట్లు విడుదల అయ్యాయి. సాధారణంగా ప్రతీ నెలా పదో తేదీలోపు ఈ నిధులను విడుదల చేస్తారు. అయితే గడువు కంటే ముందే కేంద్ర ప్రభుత్వం ఈ అదనపు వాటాను విడుదల చేసింది. దీనివల్ల రాష్ట్రాల వద్ద నిధుల లభ్యత పెరుగుతుందని.. అభివృద్ధి, సంక్షేమ పథకాలు సజావుగా ముందుకు సాగే అవకాశం కలుగుతుందని పేర్కొంది.

## ఇండో-చైనా సరిహద్దు వాణిజ్యం షురూ

(మొదటి తరువాయి)

కార్యక్రమం జరిగింది. రెండు పొరుగు దేశాల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 14 వేల అడుగులకు పైగా ఎత్తులో ఉన్న ఈ వ్యూహాత్మక పర్వత మార్గం ద్వారా కాలానుగుణ వాణిజ్యం తిరిగి ప్రారంభమైంది.

సిక్కిం వాణిజ్య పరిశ్రమల శాఖ కార్యదర్శి కర్మ డి యోట్సో ఈ పునఃప్రారంభాన్ని ప్రకటిస్తూ ప్రస్తుతం ద్విపాక్షిక వాణిజ్య ప్రోటోకాల్ ప్రకారం నవంబర్ వరకు సోమవారం నుంచి గురువారం వరకు కాలానుగుణ వాణిజ్యం జరుగు తుందని చెప్పారు. ఈ సంవత్సరం 38 మంది నమోదిత వ్యాపారులకు వాణిజ్య పాస్లు జారీ చేశారు. చేనేత ఉత్పత్తులు, సాంప్రదాయ, ధార్మిక వస్తువులు, రెడీ మేడ్ వస్త్రాలు, ఇతర ఆమోదించబడిన వస్తువులు సహా 36 నోటిఫైడ్ అంశాలు ఈ మార్గం ద్వారా వ్యాపారం చేయబడ తాయి. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ను అమలు చేస్తూ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసింది. నాథు లా వద్ద అదనపు సిబ్బంది మోహరించారు. మొదటిసారి మహిళా ప్లాటూన్ కూడా ఉంది. ఇది నమోదిత వ్యాపారులు, రవాణా ఆపరేటర్లు, సరిహద్దు వాణిజ్యంపై ఆధారపడిన ఇతర వాటాదారులకు వ్యాపారం కల్పించడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు కొత్త ఉత్సాహం ఇస్తుందని అంచనా.

రోజుకు రూ. 2 లక్షల వ్యాపారం

ప్రతి వ్యాపారి రోజుకు రెండు లక్షల రూపాయల విలువైన వస్తువులను వ్యాపారం చేయవచ్చు. గేట్ ఉదయం 7.30 గంటలకు తెరుచుకుంటుంది. నాథు లా ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ ని మౌలిక సదుపాయాలు దీర్ఘకాలిక మూసివేత, కఠినమైన హిమాలయ శీతాకాలాల కారణంగా కనుమరుగై పోయాయి. వాటిని పునరుద్ధరించి పనిచేసేలా చేశారు. ఈ పునఃప్రారంభం సిక్కింలోని సుమారు 600 మంది నమోదిత వ్యాపారులకు జీవనోపాధి పునరుద్ధరణగా ఉంటుంది. ఇది గల్వాన్ సంఘటన తర్వాత రెండు అణు శక్తుల మధ్య సంబంధాలలో సాధారణ జీవించే విస్తృత ప్రయత్నాలలో భాగంగా చూడబడుతోంది.

40 ఏళ్లు మూసివేత.. 2006లో పునఃప్రారంభం

1962 భారత్-చైనా యుద్ధం తర్వాత నాలుగు దశాబ్దాలకు పైగా మూసి వేయబడిన నాథు లా 2006లో సరిహద్దు వాణిజ్యం కోసం తిరిగి తెరవబడింది. ఇది రెండు దేశాల మధ్య నియమించబడిన సరిహద్దు వాణిజ్య కేంద్రాలలో ఒకటి. సాంప్రదాయకంగా ప్రతి సంవత్సరం మే నుంచి నవంబర్ వరకు పనిచేస్తుంది. భారత్ వైపు షేరాథాంగ్ ట్రేడ్ మార్ట్ చైనా వైపు రించెన్ గాంగ్ ట్రేడ్ మార్ట్ను కలుపుతుంది. నమోదిత వ్యాపారులు ఆమోదించబడిన స్థానిక ఉత్పత్తులను మార్పిడి చేసుకుంటారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# కీవ్‌పై మిస్సైళ్లు, డ్రోన్లతో దాడి..

**- 9 మంది మృతి, 22 మందికి గాయాలు**



**కీవ్: -01 ఆగస్టు 01 (జర్నలిస్ట్ డైరీ) :**
రష్యా మళ్లీ విరుచుకుపడింది. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసింది. శనివారం ఉదయం ఆ అటాక్ జరిగింది. ఆ దాడిలో 9 మంది మృతిచెందగా, 22 మంది గాయపడినట్లు తెలుస్తోంది. సోలోమియానస్కీ జిల్లాలో ఉన్న 5 అంతస్తుల రెసిడెన్షియల్ బిల్డింగ్ దెబ్బతిన్నది. ఆ బిల్డింగ్‌లో ఉన్న 35 మంది తరలించారు. డర్నిస్టికి జిల్లాలో జరిగిన దాడి వల్ల ఏడు మంది మృతిచెందగా, మరో 14 మంది గాయపడ్డారు. అటాక్ వల్ల ఇండ్లు కూలి మంటలు వ్యాపించాయి. ఆ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. కీవ్ సమీపంలో ఉన్న మిలిటరీ పారిశ్రామిక కేంద్రాలు, లాజిస్టిక్ హబ్‌లను టార్గెట్ చేసినట్లు రష్యా పేర్కొన్నది. డజన్ల సంఖ్యలో క్షిపణులను వదిలినట్లు రష్యా చెప్పింది. శుక్రవారం రాత్రి హై ప్రిసిషన్ గ్రౌండ్, సీ లాంచ్డ్ వెపన్స్, లాంగ్ రేంజ్ డ్రోన్లతో అటాక్ జరిగినట్లు రష్యా మిలిటరీ శాఖ పేర్కొన్నది. మిస్సైళ్లు, డ్రోన్లు, రేడార్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ ఎక్విప్మెంట్ ఉన్న ప్రొడక్షన్, స్టోరేజీ కేంద్రాలను టార్గెట్ చేసినట్లు రష్యా చెప్పింది.

# బెంగాల్ సీఎంపై దాడికి కుట్ర..

**- జైషే ఉగ్రవాది ప్రియురాలు అరెస్ట్**



**కోల్‌కతా -01ఆగస్ట్ (జర్నలిస్ట్ డైరీ) :**
పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారిపై దాడి కోసం కుట్ర పన్నారనే ఆరోపణలపై అనుమానిత జైష్ ఉగ్రవాది ప్రియురాలిని స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. రాజకీయ నాయకులు, ప్రముఖులను లక్ష్యంగా చేసుకునే హనీట్రాప్ నెట్‌వర్క్‌లో ఆమె భాగమని అనుమానిస్తున్నారు. బెంగాల్ సీఎం సువేందు అధికారిపై దాడికి జైష్-ఎ-మొహమ్మద్ కార్యకర్త హమీమ్ మండల్ ప్రణాళిక రచిస్తున్నట్లు బెంగాల్ పోలీసుల దర్యాప్తులో తెలిసింది. దీంతో పూర్బ బర్ధమాన్‌లో అతడ్ని అరెస్ట్ చేశారు.కాగా, హమీమ్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్న అతడి ప్రియురాలు అర్పితా సర్కార్ ఈ నెట్‌వర్క్‌లో భాగమని పోలీసులు అనుమానించారు. సీఎం సువేందు అధికారిపై దాడి కోసం రాజకీయ నాయకులు, ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని హనీట్రాప్ చేసే ఎత్తుగడలు ఆమె వేస్తున్నట్లు హమీమ్ విచారణ వివరాలు, సాంకేతిక ఆధారాల ద్వారా తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో జార్ఖండ్‌లోని సాహిబ్‌గంజ్‌లో అర్పితను బెంగాల్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఫోరెన్సిక్ పరీక్ష కోసం ఆమె మొబైల్ ఫోన్, ఇతర డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెట్‌వర్క్‌లోని ఇతర వ్యక్తులను గుర్తించేందుకు అర్పిత కాల్స్ రికార్డులు, ఆర్థిక లావాదేవీలను కూడా విశ్లేషిస్తున్నారు. మరోవైపు ఈ నెట్‌వర్క్ ఎంత వరకు విస్తరించింది, ఇతర రాష్ట్రాల్లో కూడా వీరి కార్యకలాపాలు కొనసాగుతున్నాయా? అన్న దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ నేపథ్యంలో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశమున్నదని వెల్లడించారు.

# కలిసొచ్చిన ఏడు..
# కోటీశ్వరుడు అయ్యాడు




**న్యూఢీల్లి -01ఆగస్ట్ (జర్నలిస్ట్ డైరీ) :**
నార్త్ కరోలినా రాష్ట్రం, బిస్కోలోని మాంట్‌గోమరీ కౌంటీలో నివసించే టోమాస్ మునోజ్ అనే వ్యక్తికి నంబర్ 7తో అనుబంధం ఉంది. ఎందుకంటే ఆయన పుట్టింది 1977వ సంవత్సరం 7వ తేదీ. అంతేకాదు పది డాలర్ల విలువైన 'ట్రిపుల్ రెడ్ 777 జాక్‌పాట్ అనే లాటరీ టికెట్‌ను కొనుగోలు చేశాడు. అతడు కొన్న ఈ టికెట్‌కు ఒక మిలియన్ డాలర్ల (సుమారు 9.5 కోట్లు) లాటరీ తగిలి జాక్‌పాట్ కొట్టాడు.నార్త్ కరోలినా ఎడ్యుకేషన్ ట్రిపుల్ రెడ్ 777 జాక్‌పాట్ లాటరీని కొత్తగా ప్రారంభించారు. క్యాండర్‌లోని సౌత్ (రాశీబ్‌స్త్ర) మెయిన్ స్ట్రీట్‌లో ఉన్న క్యాండర్ వీ మార్ట్‌లో 777 నంబర్ గల లాటరీని చూసి కచ్చితంగా కొనాలని నిర్ణయించుకున్నాడు. ఎందుకంటే పుట్టిన తేదీ 7, 77వ సంవత్సరం, 777 అవుతుంది కాబట్టి ఆ లాటరీని కొనుగోలు చేశానని తెలిపాడు. ఆ లాటరీ గెలుచుకోవడం ఆనందంగా ఉందని అన్నాడు. ఈ బహుమతిని ఇరవై సంవత్సరాల పాటు యాభైవేల డాలర్లు వాయిదాల రూపంలో లేదా ఒకేసారి ఆరు లక్షల డాలర్లు తీసుకోవాలని లాటరీవారు చెప్పారు. ఒకేసారి ఆరు లక్షల డాలర్లు తీసుకున్నాడు. దీంట్లో పన్నులు పోగా 3,96,060 డాలర్లు ఇంటికి తీసుకెళ్లాడు. క్లాసిక్ కార్లను కొనుగోలు చేసి వాటిని బాగుచేసే తన వృత్తిలోనే ఈ డబ్బును పెట్టుబడిగా పెడతానని ఆయన వెల్లడించారు. పాఠశాల నిర్మాణానికి సహాయపడటానికి ఈ లాటరీని ప్రారంభించామని నిర్వాహకులు తెలిపారు. లాటరీ ద్వారా సేకరించిన డబ్బులో మాంట్‌గోమరీ కౌంటీకే 2.6 మిలియన్ డాలర్లకు పైగా అందజేశామని వారు పేర్కొన్నారు.

# పాకిస్తానీయులు మెచ్చిన 'రామాయణ'

**న్యూఢీల్లి -01ఆగస్ట్ (జర్నలిస్ట్ డైరీ) :**
రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, యష్ రావణుడిగా నటిస్తున్న రామాయణ సినిమాను నితీష్ తివారీ రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ట్రైలర్‌ను జూలై 30న తెల్లవారు 5 గంటలకు బ్రహ్మమూర్తాన విడుదల చేశారు. ఈ ట్రైలర్ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటుంది. అంతేకాదు దాయాది దేశం పాకిస్తాన్‌లో కూడా ఈ ట్రైలర్ ప్రశంసలు పొందుతుంది. ఈ ట్రైలర్‌ను అక్కడి థియేటర్లలో ప్రదర్శిస్తున్నారు. దీంతో అక్కడి సినీప్రియులతో పాటు యూట్యూబర్స్, నిర్మాతలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.పాకిస్తానీ ప్రముఖ యూట్యూబర్ మావియా ఉమర్ ఫారూఖీ రామాయణ ట్రైలర్ తన అంచనాలను మించిపోయిందని ప్రశంసించారు. నిర్మాణ విలువలు చూసి ఆశ్చర్యం వేసిందని పేర్కొన్నారు. ఇంతటి ఖరీదైన ప్రాజెక్టును



బాలీవుడ్ ఎలా నిర్మిస్తుందని ప్రశ్న లేవనెత్తారు. వెయ్యి కోట్ల రూపాయలతో సినిమాను నిర్మిస్తున్నారని నివేదికలు తెలుపుతున్నాయని అన్నారు. నెటిజన్లు అది కాదని ఈ సినిమా రెండు భాగాలుగా సుమారు రూ. 4000 కోట్లకు పైగా భారీ బడ్జెట్‌తో తీస్తున్నారని తెలపడంతో అవునా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇది భారతీయ, హిందూ ధర్మానికి సంబంధించిన సినిమా అయినప్పటికీ ట్రైలర్ చూశాక సినిమాను అభినందించలేకుండా ఉండలేకపోతున్నానని వెల్లడించారు. అదేవిధంగా ట్రైలర్‌లోని నటుల నటన, డైలాగులు బాగున్నాయని మెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా రావణుడిగా రాక్‌స్టార్ యష్ (ఘంప్త్ర), రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి నటనను ప్రత్యేకంగా ప్రశంసిస్తున్నారు. బాలీవుడ్‌లో ఈ చిత్రం ప్రతిష్ఠాత్మకంగా నిలుస్తుందని వారు అభిలషిస్తున్నారు. రెండు భాగాలుగా రానున్న ఈ సినిమా మొదటి పార్ట్ ఈ ఏడాది దివాళికి, రెండో పార్ట్ వచ్చే ఏడాది దివాళికి విడుదల చేస్తున్నారు. ఈ సినిమాను పాన్ వరల్డ్‌గా ప్రపంచవ్యాప్తంగా 40 భాషల్లో విడుదల చేస్తున్నారు. ఇతిహాస గాథ అయిన రామాయణ ఎన్నో తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. దీనిలోని ధర్మం, మర్యాద, ధైర్యం, కరుణ, మాట విలువ ఆదర్శాలే ఈ స్ఫూర్తికి కారణం.

# మళ్లీ ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్ర..

**- బల్తాల్ మార్గం నుంచి మాత్రమే అనుమతి**

**న్యూఢీల్లి -01ఆగస్ట్ (జర్నలిస్ట్ డైరీ) :**
అమర్‌నాథ్ యాత్ర శనివారం తిరిగి ప్రారంభమైంది. వాతావరణం అనుకూలించడంతో బల్తాల్ మార్గంలో యాత్రను తిరిగి ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. గత నెలలో ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్ర ఉత్సాహంగా కొనసాగుతోంది. అయితే, భారీ వర్షాలు, రోడ్లు దెబ్బతినడం, వాతావరణం అనుకూలంగా లేకపోవడం వంటి కారణాల వల్ల యాత్రను శుక్రవారం తాత్కాలికంగా నిలిపివేశారు. కానీ, శనివారం వర్షాలు తగ్గడం, వాతావరణం అనుకూలంగా ఉండటంతో యాత్రను తిరిగి ప్రారంభించారు.ఇదే సమయంలో రోడ్లకు కూడా



మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం బల్తాల్ మార్గంలో అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైందని, భక్తులను పవిత్ర మంచులింగాన్ని దర్శించుకునేందుకు అనుమతిస్తున్నామని అధికారులు వెల్లడించారు. అయితే, పహల్గాం మార్గం నుంచి సాగే యాత్రను అధికారులు ఇంకా నిలిపివేశారు. ఈ మార్గంలో వాతావరణం అనుకూలంగా లేకపోవడం, రోడ్ల మరమ్మతు పనులు సాగుతుండటంతో ప్రస్తుతానికి యాత్రను నిలిపివేసినట్లు తెలిపారు. ఇదే సమయంలో అనేక ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటం వల్ల జమ్మూ-శ్రీనగర్ హైవేను అధికారులు మూసివేశారు. ఇది 250 కిలోమీటర్ల దూరం కలిగిన జాతీయ రహదారి. కాశ్మీర్‌ను, దేశమంతా కలిపి ఉంచే రహదారి ఇదే. ఈ రోడ్డు మార్గం దెబ్బతినడంతో భాగవతి నగర్ బేస్ క్యాంప్ నుంచి వెళ్లాల్సిన భక్తుల్ని కూడా అనుమతించడం లేదు. ఇంకా అక్కడి అనేక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. గత నెల 3న ఈ యాత్ర ప్రారంభమైంది. ఇప్పటివరకు 4,50,000 మంది భక్తులు పవిత్ర గుహలోని మంచులింగాన్ని దర్శించుకున్నారు. ప్రతి ఏడాదికోసారి సాగే అమర్‌నాథ్ యాత్ర ఈ నెల చివరి వరకు కొనసాగనుంది.

# అయోధ్య మెడికల్ కాలేజీలో కలకలం..
# బాంబు తయారీ పత్రం లభ్యం

**లక్నో -01ఆగస్ట్ (జర్నలిస్ట్ డైరీ) :**
ఉత్తరప్రదేశ్ అయోధ్యలోని మెడికల్ కాలేజీలో బాంబు తయారీకి సంబంధించిన పత్రం బయటపడింది. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఒక వైద్య విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన ఆ మెడికల్ కాలేజీలో కలకలం రేపింది. అయోధ్యలోని రాజర్షి దశరథ్ అటానమస్ స్టేట్ మెడికల్ కాలేజీలోని ఎక్స్-రే గదిలో బాంబు తయారీకి సంబంధించిన సూచనలు ఉన్న కాగితాన్ని ఆ విభాగపు ఇన్‌చార్జి శనివారం గుర్తించారు. చేతితో రాసిన ఆ కాగితంలో పేలుడు పదార్థం తయారీకి కావలసిన వివరాలు ఉన్నాయి. గేజ్ వైర్, అమ్మోనియం కార్బోనేట్, రెడ్ ఫాస్ఫరస్, రెడ్ సల్ఫైడ్, నైట్రిక్ యాసిడ్ వంటి వస్తువుల జాబితా కూడా ఉన్నది.కాగా, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ (సీఎంఎస్) డాక్టర్ అరవింద్ సింగ్



దీని గురించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఆ కాగితాన్ని పరిశీలించారు. శుక్రవారం రాత్రి ఎక్స్-రే గదిలో విధుల్లో ఉన్న మొదటి సంవత్సరం వైద్య విద్యార్థి సర్ఫరాజ్ ఈ పత్రాన్ని రూపొందించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఉత్తరప్రదేశ్‌లోని బలరాంపూర్‌కు చెందిన అతడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సర్ఫరాజ్‌తో పాటు విధుల్లో ఉన్న మరో ఇద్దరిని కూడా విచారిస్తున్నారు. దీనిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. మరోవైపు ఈ సంఘటనతో మెడికల్ కాలేజీ యాజమాన్యం అప్రమత్తమైంది. కాలేజీ క్యాంపస్‌లో నిఘా పెంచాలని, ప్రాంగణంలోని భద్రతా ఏర్పాట్లపై సమీక్ష జరుపాలని సిబ్బందిని ఆదేశించింది. అలాగే 2025 నవంబర్‌లో ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనను ఇది గుర్తుకు తెచ్చింది. ఆ కేసులోని ముగ్గురు ప్రధాన నిందితులు ఫరీదాబాద్‌లోని అల్ ఫలా యూనివర్సిటీ ఉద్యోగులు కావడం గమనార్హం.

# 30 మంది విద్యార్థినులు ఆసుపత్రిపాలు..

**ఆ స్కూల్‌కు దెయ్యం పట్టిందంటూ వదంతులు**

**కోల్‌కతా -01ఆగస్ట్ (జర్నలిస్ట్ డైరీ) :**
ఒక స్కూల్‌కు చెందిన సుమారు 30 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, కండరాల నొప్పులు, అసాధారణ శారీరక కదలికలతో ఆ బాలికలు ఇబ్బందిపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే ఆ స్కూల్‌కు దెయ్యం పట్టిందంటూ వదంతులు వ్యాపించాయి.పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సందేశ్‌ఖాలిలో ప్రభుత్వ సహాయం పొందే ఫుల్మోని ఆదర్శ విద్యామందిర్‌లో శుక్రవారం వింత సంఘటన జరిగింది. 9వ తరగతికి చెందిన సుమారు 30 మంది బాలికలు స్కూల్ సమయంలో ఒకరి తర్వాత ఒకరు అస్వస్థతకు




గురయ్యారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, కండరాల నొప్పులు, అసాధారణ శారీరక కదలికలతో బాధపడ్డారు. ఆ విద్యార్థినులను తొలుత స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం మీనాఖా గ్రామీణ ఆసుపత్రికి తరలించారు.కాగా, ఈ సంఘటన స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల్లో భయాందోళనలు కలిగించింది. ఆ స్కూల్‌కు 'దెయ్యం పట్టడమే' దీనికి కారణమన్న వదంతులు వ్యాపించాయి. ఈ నేపథ్యంలో సందేశ్‌ఖాలీ ఎమ్మెల్యే సనత్ సర్దార్ ఆ పాఠశాలను సందర్శించారు. అస్వస్థతకు గురైన కొందరు విద్యార్థినులను తన వాహనంలో ఆసుపత్రికి తరలించారు. మరోవైపు జిల్లా డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్, ఆరోగ్య శాఖ అధికారులు ఆ స్కూల్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. విద్యార్థినుల ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ప్రాథమిక చికిత్స తర్వాత చాలా మంది బాలికలు కోలుకున్నట్లు తెలిపారు. అయితే అవగాహన లేకుండా దెయ్యం వదంతులు వ్యాప్తి చేయవద్దని ఆరోగ్య శాఖ అధికారులు సూచించారు. బాలికల అనారోగ్య లక్షణాలను శాస్త్రీయ, వైద్యపరమైన కోణంలో పరిశీలించడంతోపాటు ఈ సంఘటనకు అసలు కారణాన్ని గుర్తించడంపై దృష్టి సారించినట్లు వెల్లడించారు.

# అంతర్జాతీయ కబడ్డీ ప్లేయర్ భార్య ఆత్మహత్య

**రోహతక్: -01ఆగస్ట్ (జర్నలిస్ట్ డైరీ) :**
అంతర్జాతీయ కబడ్డీ ప్లేయర్ షీలూ బల్‌హారా భార్య 23 ఏళ్ల ముస్కాన్ బల్‌హారా ఆత్మహత్య చేసుకున్నది. రోహతక్ జిల్లాలోని బాహూ అక్బార్‌పుర్ గ్రామంలో ఆమె బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. ఈ ఘటన పట్ల దర్యాప్తు కొనసాగుతోందని రోహతక్ ఎస్పీ గౌరవ్ రాజ్‌పురోహిత్ తెలిపారు. కుటుంబసభ్యుల స్టేట్మెంట్ రికార్డు చేస్తున్నారు. షీలూ బల్‌హారను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకు పోలీసులు ఎటువంటి ప్రకటన రిలీజ్ చేయలేదు. ముస్కాన్ కుటుంబ సభ్యులు షీలూ ఇంటి ముందు ధర్నా చేశారు.తన కూతుర్ని వేధింపులకు గురి చేసినట్లు ఆరోపించారు. ఫోరెన్సిక్ బృందం ఆ ఇంటిని తనిఖీ



చేసింది. ఆధారాలను సేకరించారు. రోహతక్‌లోని పీజీఐఎంఎస్ ఆస్పత్రికి ముస్కాన్ మృతదేహాన్ని తీసుకెళ్లారు. మెహంలోని ఫర్మానా గ్రామానికి చెందిన ముస్కాన్ 2023 డిసెంబర్‌లో షీలూను పెళ్లి చేసుకున్నది. ఆ ఇద్దరికీ 9 నెలల కుమారుడు ఉన్నాడు. షీలూ తొలుత జూడో, రెజ్లింగ్‌లో శిక్షణ పొందాడు. ఆ తర్వాత అతను తన కెరీర్‌ను కబడ్డీపై ఫోకస్ పెట్టాడు. షీలూకు 'హర్యానా ఆలా చీతా'గా పేరున్నది. కబడ్డీలో ప్రత్యర్థి ఆటగాళ్లను ఈజీగా పట్టేస్తాడు. భారత జట్టు తరపున విదేశాల్లోనూ అతను మ్యాచ్‌లు ఆడాడు. ఆత్మహత్య చేసుకోవడానికి ముందు రోజు .. ముస్కాన్ తన ఇన్‌స్టాలో ఓ పంజాబీ పాటకు చెందిన రీల్‌ను పోస్టు చేసినట్లు తెలిసింది.

# గత చరిత్రను విస్మరించిన జాతి మరో చరిత్రను సృష్టించలేదు

చరిత్ర అంటే కేవలం గతాన్ని గుర్తు చేసుకోవడం కాదు. వర్తమానాన్ని సరిదిద్దుకొని భవిష్యత్తును నిర్మించుకోవడానికి ఒక జాతి నేర్చుకునే జీవన పాఠం. వ్యక్తికి జ్ఞాపకశక్తి ఎంత అవసరమో, ఒక జాతికి చరిత్ర అంత అవసరం. గతంలో జరిగిన విజయాలు, వైఫల్యాలు, యుద్ధాలు, విప్లవాలు, సంస్కరణలు, నాగరికతల ఉత్థాన--పతనాలు, ప్రజల పోరాటాలు, రాజ్యాల ఆవిర్భావం, పతనం వంటి అనేక అనుభవాలను ఒక తరం నుంచి మరో తరానికి అందించేది చరిత్ర మాత్రమే. అందుకే ప్రపంచంలోని ప్రతి అభివృద్ధి చెందిన దేశం చరిత్రను కేవలం ఒక పాఠ్యాంశంగా కాకుండా, జాతీయ చైతన్యాన్ని నిర్మించే శక్తివంతమైన సాధనంగా చూస్తోంది.“చరిత్రను గుర్తుంచుకోలేని వారు దానిని మళ్లీ పునరావృతం చేయడానికి శిక్షించబడతారు” అని తత్వవేత్త జార్జ్ సాంటాయానా చెప్పిన మాట నేటికీ సజీవ సత్యమే. బ్రిటిష్ చరిత్రకారుడు ఈ. హెచ్. కార్ “చరిత్ర అనేది గతానికీ వర్తమానానికీ మధ్య జరిగే నిరంతర సంభాషణ” అని నిర్వచించారు. బ్రిటిష్ నాయకుడు విన్స్టన్ చర్చిల్ “ఎంత వెనక్కి చూడగలిగితే అంత ముందుకు చూడగలుగుతారు” అని పేర్కొన్నారు. ఈ మూడు వ్యాఖ్యలే చరిత్ర ప్రాముఖ్యతను అద్భుతంగా వివరిస్తాయి. ఒక దేశం తన గతాన్ని అర్థం చేసుకోకపోతే, అదే తప్పులను మళ్లీ మళ్లీ చేసే ప్రమాదం ఉంటుంది.చరిత్ర ప్రభావం ఎంత శక్తివంతమైనదో ప్రపంచాన్ని గడగడలాడించిన నియంతలు కూడా గుర్తించారు. జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్ చరిత్ర అధ్యయనం ప్రజల్లో ప్రశ్నించే స్వభావాన్ని, తిరుగుబాటు చైతన్యాన్ని పెంచుతుందని భావించాడని చరిత్రలో తరచూ ప్రస్తావిస్తారు. అలాగే ఫ్రెంచ్ చక్రవర్తి నెపోలియన్ బోనాపార్టీకు ఆపాదించబడే ఒక ప్రసిద్ధ వ్యాఖ్య ప్రకారం, చరిత్ర, రాజకీయాలను లోతుగా అధ్యయనం చేసిన కొద్దిమంది యువకులు కూడా పెద్ద సైన్యంతో సమానమైన ప్రభావాన్ని చూపగలరని భావన వ్యక్తమవుతుంది. ఈ వ్యాఖ్యల చారిత్రక ప్రామాణికతపై పండితుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, వాటి వెనుక ఉన్న సందేశం మాత్రం స్పష్టంగా ఉంటుంది. చరిత్ర మనిషిలో విమర్శనాత్మక ఆలోచనను, సామాజిక స్పృహను, మార్పు కోసం నిలబడే ధైర్యాన్ని పెంపొందిస్తుంది.

సామాజిక శాస్త్రాలలో చరిత్రకు అత్యంత కీలకమైన స్థానం ఉంది. రాజకీయ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, సమాజ శాస్త్రం, ప్రజా పరిపాలన, అంతర్జాతీయ సంబంధాలు, న్యాయశాస్త్రం వంటి అన్ని శాఖలకు చరిత్రే పునాది. చరిత్ర తెలియకుండా రాజ్యాంగ పరిణామం అర్థం కాదు. ప్రజాస్వామ్య వికాసం అర్థం కాదు; సామాజిక అసమానతల మూలాలు అర్థం కావు; యుద్ధాలు, శాంతి ఒప్పందాలు, విప్లవాలు, సంస్కరణల ప్రభావాన్ని అంచనా వేయడం కూడా సాధ్యం కాదు. అందుకే చరిత్రను అనేక విద్యావేత్తలు సామాజిక శాస్త్రాల వెన్నెముకగా అభివర్ణిస్తారు.

ఈ విషయాన్ని అభివృద్ధి చెందిన దేశాలు చాలా ముందుగానే గుర్తించాయి. అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయం, యేల్ విశ్వవిద్యాలయం, ప్రిన్స్టన్ విశ్వవిద్యాలయం, బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం వంటి విశ్వవిద్యాలయాల్లో చరిత్రకు ప్రత్యేక విభాగాలు, పరిశోధనా కేంద్రాలు, డిజిటల్ ఆర్కైవ్స్, మ్యూజియంలు, అరుదైన పత్రాల భాండాగారాలు ఏర్పాటు చేశారు. అక్కడ చరిత్ర విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలు చదవడం మాత్రమే కాదు, శాసనాలు, చారిత్రక పత్రాలు, న్యాయ రికార్డులు, పాత పత్రికలు, జనాభా గణాంకాలు, పురావస్తు ఆధారాలను విశ్లేషిస్తూ శాస్త్రీయ పరిశోధన చేస్తారు. స్కూల్ స్థాయి నుంచే మ్యూజియంల సందర్శనలు, చారిత్రక కట్టడాల అధ్యయనం, మూలాధారాల విశ్లేషణ వంటి పద్ధతుల ద్వారా విద్యార్థుల్లో ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందిస్తారు.

దీనికి భిన్నంగా, భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, చరిత్ర సబ్జెక్ట్ క్రమంగా తన ప్రాధాన్యతను కోల్పోయింది. విద్యా సంస్కరణల పేరిట ఉపాధి కల్పించే సబ్జెక్టులపైనే ఎక్కువ దృష్టి పెట్టడంతో చరిత్ర వంటి సామాజిక శాస్త్రాలు వెనుకబడ్డాయి. ఇంటర్మీడియట్ స్థాయిలో చరిత్రను ప్రధానంగా అధ్యయనం చేసే విద్యార్థుల సంఖ్య బాగా తగ్గింది. అనేక ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చరిత్ర అధ్యాపకుల పోస్టులు తగ్గిపోయాయి లేదా ఇతర సామాజిక శాస్త్రాలతో కలిపి బోధించే పరిస్థితి ఏర్పడింది. దీని ప్రభావం కేవలం ఒక సబ్జెక్టుపైనే కాదు; సమాజంలో చారిత్రక స్పృహ, ప్రజాస్వామ్య అవగాహన, ప్రాంతీయ చరిత్రపై ఆసక్తి కూడా తగ్గడానికి దోహదపడింది.ప్రాంతీయ చరిత్రను నిర్లక్ష్యం చేయడం అంటే ఒక ప్రాంతపు సామాజిక స్మృతిని బలహీనపరచడమే. ఈ వాస్తవాన్ని తెలంగాణ అనుభవం స్పష్టంగా తెలియజేస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో విద్యా విధానాల్లో వచ్చిన మార్పుల కారణంగా ఇంటర్మీడియట్ స్థాయిలో చరిత్ర సబ్జెక్ట్ క్రమంగా ఆదరణ కోల్పోయింది. ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకొని సైన్స్, కామర్స్, వృత్తి విద్యా కోర్సులపై ఎక్కువ దృష్టి పెట్టడం జరిగింది. ఫలితంగా చరిత్రను అధ్యయనం చేసే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. అనేక జూనియర్ కళాశాలల్లో చరిత్ర అధ్యాపకుల పోస్టులు భర్తీ కాకపోవడం, కొన్ని చోట్ల చరిత్ర--పౌరశాస్త్రం ఉమ్మడి పోస్టులుగా కొనసాగడం, మోడల్ స్కూల్స్, కొన్ని గురుకుల విద్యాసంస్థల్లో ప్రత్యేక చరిత్ర అధ్యాపకులు లేకపోవడం వంటి పరిస్థితులు ఈ సబ్జెక్టు ప్రాధాన్యతను మరింత తగ్గించాయి.

దీని ప్రభావం విద్యా వ్యవస్థకే పరిమితం కాలేదు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, రైతాంగ పోరాటాలు, నిజాం కాలపు సామాజిక పరిస్థితులు, భాషా ప్రత్యేకత, ప్రాంతీయ ఉద్యమాల నేపథ్యం వంటి అంశాలపై యువతలో అవగాహన తగ్గిందనే ఆందోళనను అనేక మంది విద్యావేత్తలు వ్యక్తం చేశారు. ఒక ప్రాంత చరిత్రను చదవని తరం, ఆ ప్రాంత అస్తిత్వాన్ని కూడా పూర్తిగా అర్థం చేసుకోలేదని వారు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర చరిత్ర, తెలంగాణ ఉద్యమ చరిత్రకు పోటీ పరీక్షల్లో ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం, గ్రూప్-1, గ్రూప్-2 వంటి పరీక్షల్లో ప్రత్యేక భాగాలుగా చేర్చడం ఈ లోటును కొంతవరకు పూరించడానికి చేసిన ప్రయత్నంగా చూడవచ్చు.అయితే చరిత్ర ప్రాధాన్యత పోటీ పరీక్షల వరకే పరిమితం కావడం సరిపోదు. విద్యార్థి డాక్టర్ అయినా, ఇంజనీర్ అయినా, న్యాయవాది అయినా, శాస్త్రవేత్త అయినా, పరిపాలనా అధికారి అయినా, అతడు ముందుగా ఒక బాధ్యతగల పౌరుడు. ఆ పౌరుడికి తన దేశ చరిత్ర, రాజ్యాంగ వికాసం, సామాజిక ఉద్యమాలు, స్వాతంత్ర్య పోరాటం, ప్రాంతీయ సంస్కృతుల గురించి కనీస అవగాహన ఉండాలి. అందుకే అనేక మంది విద్యావేత్తలు ఇంటర్మీడియట్ స్థాయిలో చరిత్రను అందరికీ ఉమ్మడి లేదా తప్పనిసరి సబ్జెక్టుగా ప్రవేశపెట్టాలని సూచిస్తున్నారు. “చరిత్రే మూలం, పౌరశాస్త్రం దాని ఫలం” అనే విద్యావేత్తల భావన కూడా ఇదే విషయాన్ని తెలియజేస్తుంది. చరిత్ర లేకుండా పౌరస్పృహ సంపూర్ణం కాదు.ప్రపంచంలోని అభివృద్ధి



చెందిన దేశాల అనుభవం కూడా ఇదే చెబుతోంది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో చరిత్రను కేవలం గతాన్ని బోధించే సబ్జెక్టుగా కాకుండా, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసే సాధనంగా ఉపయోగిస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం, హోలోకాస్ట్, వలసవాదం, బానిస వ్యవస్థ, పౌరహక్కుల ఉద్యమాలు వంటి క్లిష్టమైన అంశాలను కూడా విద్యార్థుల నుంచి దాచిపెట్టకుండా, ఆధారాలతో, విమర్శనాత్మకంగా బోధిస్తారు. తమ చరిత్రలోని విజయాలను మాత్రమే కాదు, వైఫల్యాలను కూడా అధ్యయనం చేయించడం వల్లనే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని వారు విశ్వసిస్తారు.భారతదేశంలో కూడా ఇటీవలి సంవత్సరాల్లో చరిత్ర పాఠ్యాంశాలపై విస్తృత చర్చ జరిగింది. ముఖ్యంగా జాతీయ విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి రూపొందించిన పాఠ్యపుస్తకాలలో కొన్ని అధ్యాయాల మార్పులు, తొలగింపులు, పునర్వ్యవస్థీకరణపై విద్యావేత్తలు, చరిత్రకారులు, రాజకీయ పార్టీలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశాయి. విమర్శకుల అభిప్రాయం ప్రకారం, మధ్యయుగ భారత చరిత్ర, మొఘల్ కాలం, మతపరమైన వైవిధ్యం, సామాజిక ఘర్షణలు వంటి అంశాలకు సంబంధించిన కొన్ని భాగాలు తగ్గించబడటం వల్ల విద్యార్థులకు సమగ్ర చారిత్రక అవగాహన దెబ్బతినే ప్రమాదం ఉందని వాదించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం, ఎన్‌సి.ఇ.ఆర్.టి. అధికారులు పాఠ్యభారం తగ్గించడం, సిలబస్‌ను పునర్వ్యవస్థీకరించడం, కొత్త విద్యా విధానానికి అనుగుణంగా మార్పులు చేయడం వంటి కారణాలను వివరించారు. ఈ రెండు అభిప్రాయాల మధ్య ఏది సరైనదో నిర్ణయించడం కంటే, ఒక సూత్రాన్ని మాత్రం ఎప్పటికీ మరవకూడదు---చరిత్ర రచనకు అంతిమ ప్రమాణం రాజకీయ సిద్ధాంతం కాదు; ఆధారాలు, పరిశోధన, శాస్త్రీయ విశ్లేషణ.చరిత్ర ఏ ప్రభుత్వానిదీ కాదు. అది ఏ ఒక్క భావజాలానికి చెందిన ఆస్తి కూడా కాదు. ప్రతి కొత్త ప్రభుత్వం తన రాజకీయ దృక్పథానికి అనుగుణంగా చరిత్రను తిరగరాస్తే, రాబోయే తరాలు వాస్తవాలను తెలుసుకునే అవకాశాన్ని కోల్పోతాయి. అందువల్ల చరిత్ర పాఠ్యాంశాల రూపకల్పనలో రాజకీయాలకు బదులుగా స్వతంత్ర చరిత్రకారులు, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, పురావస్తు శాస్త్రవేత్తలు, భాషా నిపుణులు, సామాజిక శాస్త్రవేత్తలు కలిసి పనిచేసే వ్యవస్థ మరింత బలోపేతం కావాలి.

చరిత్రను కేవలం పాఠ్యాంశంగా కాకుండా జీవన పాఠంగా చూడాల్సిన అవసరం నేడు మరింత పెరిగింది. ఎందుకంటే సమాజం వేగంగా మారుతున్న కొద్దీ, గత అనుభవాల నుంచి నేర్చుకునే అవకాశాలు తగ్గిపోతున్నాయి. సమాచార సాంకేతికత విప్లవం వల్ల ప్రపంచం చిన్నదైనప్పటికీ, ఆ సమాచారంలో నిజం ఏదో, అబద్ధం ఏదో వేరు చేయగల చారిత్రక అవగాహన లేకపోతే యువత తప్పుదారి పట్టే ప్రమాదం ఉంది. చరిత్ర మనకు కేవలం రాజులు, యుద్ధాలు, ఒప్పందాలు మాత్రమే చెప్పదు. అది సమాజం ఎలా ఆలోచించింది, ఎలా మారింది, ఏ తప్పులు చేసింది, ఏ విజయాలు సాధించింది అన్నదాన్ని కూడా తెలియజేస్తుంది.

తెలంగాణ సందర్భంలో చూస్తే, ప్రాంతీయ ఉద్యమ చరిత్ర ఒక సామూహిక చైతన్యానికి ప్రతీకగా నిలిచింది. దశాబ్దాల పోరాటం, భాషా--సాంస్కృతిక గుర్తింపు కోసం జరిగిన ఉద్యమాలు, సామాజిక న్యాయం కోసం జరిగిన ప్రయత్నాలు ఇవన్నీ యువతకు తెలియాల్సిన ముఖ్యమైన అంశాలు. కానీ ఈ చరిత్రను పాఠశాల స్థాయిలో సరైన రీతిలో బోధించకపోతే, ఆ ఉద్యమాల వెనుక ఉన్న త్యాగాలు కేవలం పుస్తకాల్లోని పేర్లుగానే మిగిలిపోతాయి. ఒక తరం తన గతాన్ని మరచిపోతే, ఆ తరం భవిష్యత్తును నిర్మించడంలో కూడా దిశా నిర్దేశం కోల్పోతుంది.

ఇంకొక ముఖ్యమైన అంశం చరిత్ర బోధనలో విమర్శనాత్మక ఆలోచన (క్రిటికల్ థింకింగ్) అభివృద్ధి. విద్యార్థులు కేవలం తేదీలు, సంఘటనలు గుర్తుపెట్టుకోవడం కాకుండా, ఎందుకు ఆ సంఘటనలు జరిగాయి, వాటి వెనుక ఉన్న సామాజిక --ఆర్థిక --రాజకీయ- సాంస్కృతిక కారణాలు ఏమిటి అన్నది విశ్లేషించగలగాలి. అప్పుడు మాత్రమే చరిత్ర ఒక సజీవ వంతమైన అధ్యయనంగా మారుతుంది. లేకపోతే అది కేవలం పరీక్షల కోసం చదివే భారంగా మారిపోతుంది.ప్రస్తుత విద్యా విధానంలో నైపుణ్యాలపై ఎక్కువ దృష్టి పెట్టడం అవసరమే అయినా, మానవీయ విలువలను పెంపొందించే సబ్జెక్టులను నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరం. సాంకేతిక నైపుణ్యం ఉన్న వ్యక్తి కూడా సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలంటే, అతనికి చరిత్ర, నైతికత, రాజ్యాంగ విలువలపై అవగాహన ఉండాలి. లేకపోతే అభివృద్ధి కేవలం ఆర్థిక పరిమితుల్లోనే ఆగిపోతుంది. సామాజిక సమతుల్యత దెబ్బతింటుంది.అందువల్ల భవిష్యత్తు విద్యా విధానంలో చరిత్రకు తిరిగి గౌరవప్రదమైన స్థానం ఇవ్వడం అత్యవసరం. అది తప్పనిసరి సబ్జెక్టుగా ఉండాలా లేదా ఉమ్మడి పాఠ్యాంశంగా ఉండాలా అన్నది విధాన నిర్ణయకర్తలు నిర్ణయించవచ్చు. కానీ చరిత్రను పూర్తిగా పక్కన పెట్టే పరిస్థితి మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదు. ఎందుకంటే చరిత్రను విస్మరించిన సమాజం తనను తాను అర్థం చేసుకోలేని స్థితికి చేరుకుంటుంది.చివరగా చెప్పాలంటే, చరిత్ర మనకు గతాన్ని మాత్రమే కాదు, భవిష్యత్తును కూడా చూపించే అద్దం. ఆ అద్దాన్ని పగలగొట్టిన జాతి తన దారిని తానే కోల్పోతుంది. అందుకే చరిత్రను చదవడం అంటే కేవలం జ్ఞానం సంపాదించడం కాదు; అది ఒక బాధ్యత, ఒక చైతన్యం, ఒక నాగరికతను నిలబెట్టే ప్రయత్నం.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**
ramkishore.1504@gmail.com

---

## సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (SDVP JAC) ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరణ

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 01 (జర్నలిస్ట్ డైరీ) :** సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ను వ్యతిరేకిస్తూ ఏర్పడిన జాయింట్ యాక్షన్ కమిటీ తన కార్యాచరణను ముందుకు తీసుకెళ్తుంది. కమిటీ ఏర్పడిన తరువాత మొదటిగా సిద్ధాపూర్ గ్రామంలో ప్రజలతో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేసుకుని ఈ రోజు ప్రజలను పోరాటానికి సమాయత్తం చేయడం కోసం డంపింగ్ యార్డు వలన జరిగే నష్టాన్ని వివరిస్తూ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (ాణవూ జీూజ) నాయకులు మాట్లాడుతూ.... ఈ డంపింగ్ యార్డు వల్ల షాద్ నగర్ నియోజక వర్గం పరిస్థితి ద యానియంగా మారబోతుందని, ఇప్పుడిప్పుడే పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతం రాబోయే కాలంలో మసకభారి పోయే ప్రమాదం ఉందని, ఇది ఒక సిద్ధాపూర్ గ్రామ సమస్య కాదని, సిద్ధాపూర్ నుండి ఎటు చూసినా 50 గ్రామాలు, నాలుగు నియోజక వర్గాలు ఈ డంపు యార్డు వల్ల నష్ట పోతాయని అన్నారు. అందుకే పార్టీలకు అతీతంగా ఈ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రజా పోరాటాలు



నిర్వహించి ఆర్ హుత్వం పై డంపు యార్డు రద్దు అయ్యే వరకు పోరాటం చేస్తామని తెలిపారు.. ప్రజలు జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చే పిలుపులో భాగం కావాలని కోరారు.. కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు తమ పదవులకు రాజీనామా చేసి ఉద్యమంలో ప్రజల కోసం భాగస్వామ్యం కావాలని పిలుపును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక జాయింట్ యాక్షన్ కమిటీ (ాణవూ జీూజ ) చైర్మన్ మూడావత్ రాంబాల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, కోఆర్డినేటర్ తిరుమలయ్య, సలహా దారులు వంగూరింగంగిరెడ్డి , అబ్దుల్ రబ్ జామి, కొచైర్మన్లు వడ్డే బాలయ్య , బిత్యా నాయక్, కాకన్వినర్లు ఈశ్వర్ నాయక్, బుద్ధుల జంగయ్య, రవీంద్రనాథ్ మరియు జంగయ్య, మహేష్, భాస్కర్, ప్రవీణ్ లు పాల్గొన్నారు.

---

## షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఏబీవీపీ నాయకుడు సొప్పరి నరేందర్



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 01 (జర్నలిస్ట్ డైరీ) :** కేశంపేట మండల పరిధిలోని కోనాయపల్లి గ్రామానికి చెందిన ఏబీవీపీ నాయకుడు సొప్పరి నరేందర్ శనివారం షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గారి సమక్షంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ ప్రజల సంక్షేమం, తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వంపై విశ్వాసంతో యువత బీఆర్ఎస్‌లో చేరడం ఆనందదాయకమని పేర్కొన్నారు. పార్టీలో చేరిన సొప్పరి నరేందర్ కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తూ, పార్టీలో తగిన గుర్తింపు, ప్రోత్సాహం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి,సర్పంచులు సోప్పరి ధనలక్ష్మి రామకృష్ణ, వేణు గోపాల చారి, మాజీ సర్పంచ్ కామ్లెకార్ నవీన్ కుమార్, నాయకులు శ్రీహరి యాదవ్, సలీం, రంగు శ్రీకాంత్, అయిలాపురం సంతోష్ రెడ్డి, కాకర్ల సునీల్, చిత్రమోని చెన్నయ్య, సోమరాజు మహేష్, రంగు రాకేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## 26వ వార్డు లో వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేయించిన 26వ వార్డు కౌన్సిలర్ శివ(ఎస్పి)



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 01 (జర్నలిస్ట్ డైరీ) ;** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ భారీ వర్షాల కారణంగా 26వ వార్డులో దెబ్బతిన్న రోడ్లు.రోడ్ల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వార్డు ప్రజలకు ప్రయాణంలో ఇబ్బందులు కలగకుండా తాత్కాలికంగా మట్టితో గుంతలను పూడ్చి రాకపోకలకు అనుకూలంగా చేసే పనులను 26వ వార్డు కౌన్సిలర్ శివ (ఎస్పీ) పర్యవేక్షణలో చేపట్టారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ శివ మాట్లాడుతూ,, ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శాశ్వత రోడ్ల మరమ్మతుల కోసం సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లామని తెలిపారు. వీలైనంత త్వరగా శాశ్వత పరిష్కారం లభించేలా అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.కురుస్తున్న వర్షాల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని కూడా తెలియజేశారు.

# గిరిజన గురుకులంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**- విద్యార్థుల తాగునీటి సమస్యకు పరిష్కారం చూపిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 01 (జర్నలిస్ట్ డైరీ) :** కొత్తూర్ మండలం ఇన్ముల్ నర్వ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో అధ్యాపక బృందం, సర్పంచ్ లలిత గోపాల్ నాయక్, గ్రామస్థులు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ కి సమస్యను వివరించారు. వారి విజ్ఞప్తికి వెంటనే స్పందించిన రవీందర్ యాదవ్ పాఠశాల ఆవరణలో సొంత ఖర్చులతో బోర్ వేయించి విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ విద్యార్థుల ఇబ్బందిని గుర్తించి ఆలస్యం చేయకుండా బోర్ ఏర్పాటు చేయించిన రవీందర్ యాదవ్ సేవాభావాన్ని అభినందించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ఎప్పటికప్పుడు ముందుండి సహాయ సహకారాలు అందిస్తున్న ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు పెంటనోళ్ళ యాదగిరి, సర్పంచ్ నర్సమ్మ శ్రీను, మాజీ సర్పంచులు జంగయ్య, సంతోష్ నాయక్, రమేష్, మాజీ ఎంపీటీసీ వడ్డె బాలయ్య, నాయకులు మిట్టు నాయక్, నరసింహా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీరాములు, సిరాజోద్దీన్, గోపి నాయక్, యాదగిరి, శ్యామ్ సుందర్ రెడ్డి, సతీష్ గుప్తా, మల్లేష్, హనుమంతు, డీలర్ కుమార్, కోట్యా నాయక్, మోహన్ నాయక్, ఈ. జంగయ్య, చెన్నయ్య, రఘు, శ్రీను, బాబు రాజు తదితరులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేష్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో విశేష పూజలు



**యాచారం (ఆగస్టు 1). జర్నలిస్ట్ డైరీ.** మేడిపల్లి నక్కర్త గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో శనివారం సందర్భంగా విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. ఎ.వి.జి ఫౌండేషన్ చైర్మన్ ఆడాల వరలక్ష్మి--గణేష్ దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉదయం స్వామివారికి అభిషేకం, అర్చన నిర్వహించారు. అనంతరం శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆడాల గణేష్ మాట్లాడుతూ లక్ష్మీ నరసింహస్వామి అనుగ్రహంతో గ్రామ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.

# తల్లిపాలు-శిశువుకు సంపూర్ణ ఆహారం

**-తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి అమృతం వంటివి**
**-హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 01 (జర్నలిస్ట్ డైరీ) :** ఈరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చిన్ చోడ్ ఏరియా లోని సబ్ సెంటర్ షాద్నగర్ "ఏ" అవుట్ రీచ్ ఏరియా 6వ అంగన్వాడి సెంటర్లో జరుగుతున్న వ్యాధి నిరోధక కార్యక్రమం లో వచ్చిన తల్లులందరికీ, తల్లిపాల వారోత్సవాలలో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి హెల్త్ ఎడ్యుకేటర్ జె .శ్రీనివాసులు వివరించారు. తల్లి పాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారము అని, పాప పుట్టిన వెంటనే మొదటి గంటలోనే తల్లిపాలను ప్రారంభించడం చాలా ముఖ్యం అని, పాప పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు తప్పకుండా తల్లిపాలు మాత్రమే పట్టించాలి అని, 6 నెలల తరువాత అదనపు ఆహారం ప్రారంభించినప్పటికీ, 2 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలము తల్లిపాలను కొనసాగించడం మంచిదని హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు చెప్పారు. శిశువుకు తల్లిపాల వల్ల ప్రయోజనాలు ఏమిటి అనగా తల్లి పాలవలన శిశువుకు అవసరమైన అన్ని పోషకాలు సరైన మోతాదులు లభిస్తాయి అని, తల్లిపాల వలన రోగ నిరోధక శక్తి పెరిగి, ఇన్ఫెక్షన్లు తగ్గుతాయని, మరియు విరేచనాలు, న్యూమోనియా, చెవి ఇన్ఫెక్షన్ల వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది అని, తల్లిపాల వలన శిశు మెదడు ఎదుగుదల, జ్ఞాపకశక్తి మరియు తెలివితేటలు పెరుగుతాయని జె.శ్రీనివాసులు చెప్పారు.తల్లి పాలు ఇవ్వడం వలన తల్లికి కలిగే ప్రయోజనాలు ఏమనగా. తల్లి పాలు శిశువుకు ఇవ్వడం వలన తల్లి ప్రసవం తర్వాత గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి వస్తుంది అని, ప్రసవానంతరము రక్తస్రావము తగ్గుతుంది అని, తల్లి పాలు ఇవ్వడం వలన రొమ్ము క్యాన్సర్ మరియు అండాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం తగ్గుతుందని, సహజంగా కొంతకాలము గర్భధారణ మధ్య విరామం కల్పించడంలో సహాయపడుతుంది అని, తల్లి ఆరోగ్యం మెరుగుపడి కుటుంబానికి ఆర్థికంగా కూడా ప్రయోజనం కలుగుతుందని హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు తెలియజేశారు. ముర్రు పాలు (ఎశీశ్రీశీర్‌తీబఎ) ప్రాముఖ్యత ఏమనగా. తల్లి ప్రసవం తర్వాత మొదట వచ్చే పసుపు రంగు పాలనే మురుపాలు అంటారు అని, ఈ పాలలో వ్యాధి నిరోధక పదార్థాలు (యాంటీబాడీలు) అధికంగా ఉంటాయి అని, ముర్రు పాలు శిశువుకు మొదటి టీకా వంటివి అని, కాబట్టి వీటిని తప్పకుండా ఇవ్వాలని తల్లులకు జె. శ్రీనివాసులు తెలియజేశారు. తల్లులు గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయాలు ఏమనగా. 1). పాప పుట్టిన మొదటి గంటలో తల్లిపాలను ప్రారంభించాలి అని. 2). మొదటి ఆరు నెలలు నీరు, తేనె, గ్లూకోజు నీరు లేదా ఇతరహారము ఇవ్వకూడదు అని. 3). శిశువుకు అవసరమైనప్పుడు (పగలు, రాత్రి) తరచుగా పాలు ఇవ్వాలి అని, 4). తల్లి పాలు ఇవ్వడం వలన శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడు అని మరియు తల్లి ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు తెలియజేశారు. తల్లులకు బాల అమృతము గురించి దాని యొక్క ఉపయోగాల గురించి జె శ్రీనివాసులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ జయమ్మ, ఏ.ఎన్.ఎమ్. ఇస్తేరు రాణి, ఆశాలు మరియు తల్లులు పాల్గొన్నారు.

# న్యూ కాలనీ లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అదనపు గదులను ప్రారంభించిన గాంధీ



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 01 (జర్నలిస్ట్ డైరీ);** మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీ లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కార్నర్ స్టోన్ సాఫ్ట్వేర్ సంస్థ వారి జూ= నిధులతో రూ.22 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన 2 అదనపు తరగతి గదుల భవనం ను తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, కార్నర్ స్టోన్ సాఫ్ట్వేర్ సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు , విద్యార్థులతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించిన పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ... కార్నర్ స్టోన్ సాఫ్ట్వేర్ సంస్థ వారి జూ= నిధులతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన 2 అదనపు తరగతి గదులను ఈ రోజు ప్రారంభించుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, ఈ రోజు పాఠశాల కు పండుగ రోజు అని , విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని వారి బంగారు భవిష్యత్తుకు పునాది లాంటిది ప్రాథమిక విద్య అని, మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలియచేశారు. అన్ని హంగులతో ,సకల సౌకర్యాలతో, కొత్త సొగసుల తో భవనం ను నిర్మించడం జరిగినది అని, పిల్లలకు ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునే విధంగా నిర్మించడం జరిగినది ,జూ= ప్రతినిధులు దేవుడితో సమానం అని, ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారు అని, సామాజిక బాధ్యత గా ప్రతి ఒక్కరూ సమాజం కోసం సేవ చేయాలని, పిల్లలు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, సమాజంకు మంచిపేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని, విద్యార్థులు ఒక మంచి లక్ష్యం ఏర్పరచుకొని, మంచి క్రమ శిక్షణ, ఏకాగ్రతతో, సడలని పట్టుదలతో ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలియచేశారు.గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగానికి ఎంతగానో కృషి చేస్తున్నారు అని, మియాపూర్ 10 ఎకరాలలో 200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియన్ పాఠశాలకు ఇటీవలే శంకుస్థాపన చేసుకోవడం జరిగినది అని, త్వరలోనే పనులు ప్రారంభించుకోవడం జరుగుతుంది అని, మరియు కొండాపూర్ మరియు చందానగర్ లో కోర్ అర్బన్ పాఠశాలలను ఏర్పాటు చేయడం జరుగుతుంది అని, అన్ని ప్రభుత్వ పాఠశాలలను అన్ని హంగులతో ,సకల సౌకర్యాలతో తీర్చిదిద్దుతామని, ప్రవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతామని తెలియచేశారు, తన వంతు సహాయ సహకారాలు అందిస్తాన ని, మీకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో కార్నర్ స్టోన్ సాఫ్ట్వేర్ సంస్థ ప్రతినిధులు కార్నర్ స్టోన్ జూ= సంస్థ ప్రతినిధులు కిరణ్, ఉషారాణి, భార్గవి, పవన్, తేజ్ కుమార్, నిర్మల, హరి చైతన్య, మంజుల, శ్రీకాంత్, శ్రీనివాసరావు,నికిత, జన్య ఫౌండేషన్ ప్రతినిధులు సురేంద్ర, చిరంజీవి, మరియు నాయకులు ప్రతాప్ రెడ్డి, ఉదయ్ కిరణ్, రవిచంద్ర రెడ్డి, అరుణ మరియు ఉపాధ్యాయులు,విద్యార్థులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# బాలానగర్ మరియు రాజాపూర్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**సర్వీస్ రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలి**
**మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్**



**మిడ్జిల్, ఆగస్టు 01,జర్నలిస్ట్ డైరీ.** మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలోని మరియు రాజాపూర్ లోని జాతీయ రహదారి-44పై నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ పనులను జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు.ఫ్లైఓవర్‌కు ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లపై కాలినడకన పరిశీలించిన ఎస్పీ, ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లపై ఏర్పడిన గుంతలు, బురదతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గమనించారు. ఈ పరిస్థితిపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఎస్పీ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్షణమే సర్వీస్ రోడ్లకు మరమ్మతులు చేపట్టి, గుంతలను ఎప్పటికప్పుడు పూడ్చాలని కాంట్రాక్టర్ ప్రతినిధులకు సూచించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సర్వీస్ రోడ్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఫ్లైఓవర్ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలు మరియు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు.ఈ పరిశీలనలో జడ్చర్ల రూరల్ సీఐ మహేష్, బాలానగర్ ఎస్సై నరేందర్ రెడ్డి తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కీర్తిక జన్మదినం సందర్భంగా అనాథ చిన్నారులకు అల్పాహార సేవ





**ఎల్.బి.నగర్, ఆగస్టు 1 జర్నలిస్ట్ డైరీ.**
కృష్ణగోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో నకిరేకల్‌కు చెందిన చిన్నారి కీర్తిక జన్మదినాన్ని పురస్కరించుకుని అనాథ చిన్నారుల పాఠశాలలో శనివారం ఉదయం అల్పాహార సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 250 నుంచి 300 మంది అనాథ, నిరుపేద చిన్నారులకు పోషకాహారంతో కూడిన అల్పాహారాన్ని ప్రేమపూర్వకంగా అందజేశారు. అనంతరం చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి కీర్తిక జన్మదినాన్ని ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు నింపిన ఈ కార్యక్రమం హృదయాలను హత్తుకుంది. ఈ సేవా కార్యక్రమంలో కృష్ణగోపాల్ సేవా సమితి అధ్యక్షులు డా. కపిల్ కుమార్ అగర్వాల్ పాల్గొని చిన్నారి కీర్తికకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సమితి సభ్యులు, అధికారులు సేవా కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు అల్పాహారం వడ్డించి, సమాజంలో సేవా భావాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, జన్మదినాలు, వివాహ వార్షికోత్సవాలు, వర్ధంతులు లేదా ఇతర శుభ సందర్భాలను సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించాలనుకునే వారు కృష్ణగోపాల్ సేవా సమితిని సంప్రదించి అనాథలు, నిరుపేదలకు సేవ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## దొరికిన సెల్‌ఫోన్‌ను అప్పగించి మానవత్వం చాటుకున్న గోనెల సమ్మన్న ముదిరాజ్



**వీణవంక, ఆగస్టు 1 జర్నలిస్ట్ డైరీ.**
కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోనెల సమ్మన్న ముదిరాజ్ దొరికిన సెల్‌ఫోన్‌ను అసలు యజమానికి అప్పగించి తన నిజాయితీ, మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే, జూలై 31న పెద్దపల్లి జిల్లా గురాంపల్లిలో తన మిత్రుడు, విద్యుత్ శాఖ ఉద్యోగి పాలితపు గట్టయ్య అంత్యక్రియలకు హాజరై తిరుగు ప్రయాణంలో ఉన్న సమయంలో రాత్రి సుమారు 8:30 గంటలకు కాల్వ శ్రీరాంపూర్ మండలం గూడెం బస్టాండ్ సమీపంలో ఒక సెల్‌ఫోన్ సమ్మన్నకు దొరికింది. అనంతరం ఈ విషయాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేయగా, ఫోన్ పోగొట్టుకున్న హుజూరాబాద్‌కు చెందిన విల్సన్ స్పందించి, హుజూరాబాద్ నుంచి పెద్దపల్లి వెళ్తున్న క్రమంలో మార్గమధ్యంలో ఫోన్ పడిపోయిందని సమ్మన్నకు సమాచారం అందించాడు. సమ్మన్న సూచన మేరకు ఆగస్టు 1న ఉదయం విల్సన్ మల్లారెడ్డిపల్లి గ్రామానికి చేరుకుని తన వివరాలు వెల్లడించగా, గ్రామస్తుల సమక్షంలో గోనెల సమ్మన్న ముదిరాజ్ సెల్‌ఫోన్‌ను యజమానికి అప్పగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సమ్మన్న నిజాయితీని, మానవత్వాన్ని కొనియాడుతూ అభినందించారు. సెల్‌ఫోన్ తిరిగి అందుకున్న విల్సన్ సమ్మన్నకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోనెల సమ్మన్న ముదిరాజ్, గుమ్మడి సంపత్, రాయణవేణి చంద్రయ్య, విల్సన్, ముద్దసాని శంకరయ్య పాల్గొన్నారు.

## ఎంపీ మల్లు రవి కి కాంగ్రెస్ నేతల స్వాగతం



**ఆమనగల్లు, ఆగస్టు 01 జర్నలిస్ట్ డైరీ.**
ఆమనగల్లు పట్టణంలో శనివారం నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి కి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఆమనగల్లు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయానికి తొలిసారిగా వచ్చిన ఎంపీ మల్లు రవికి కాంగ్రెస్ నేతలు ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో పూలమాలలతో సత్కరించారు. ఆమనగల్లు మండల అభివృద్ధికి, మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేకంగా అధిక నిధులను మంజూరు చేయాలని ఎంపీ మల్లురవిని కాంగ్రెస్ నాయకులు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పత్యానాయక్, ఆమనగల్లు మాజీ సర్పంచ్, ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, మంగ్లీ రాములు, దేవరశెట్టి మహేష్, కాలే మల్లయ్య, సురేష్ నాయక్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణం అందించడం అందరి బాధ్యత

### పర్యావరణ పరిరక్షణకు విద్యార్థుల ముందడుగు
### లయన్స్ క్లబ్ ఆమనగల్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి



**తలకొండపల్లి,ఆగస్టు01 జర్నలిస్ట్ డైరీ.**
పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రమైన పరిసరాల నిర్మాణం మరియు ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలన లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో అక్షర స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, తలకొండపల్లిలో ప్లాస్టిక్ కలెక్షన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు లయన్స్ క్లబ్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని పాఠశాల పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. సుమారు 30 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి పర్యావరణ పరిరక్షణ పట్ల తమ బాధ్యతను చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ కార్యదర్శి లయన్ జి. శ్రీనివాస్ రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పునర్వినియోగం, రీసైక్లింగ్, కు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చు అని ఆయన తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు నేల, నీరు, గాలి కాలుష్యానికి ప్రధాన కారణంగా మారుతున్నాయి. వాటిని సక్రమంగా సేకరించి రీసైక్లింగ్ కు పంపించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజారోగ్యాన్ని కూడా కాపాడవచ్చు అన్నారు. చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో పర్యావరణ బాధ్యత,పరిశుభ్రత, సామాజిక సేవ భావాన్ని పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయి అన్నారు. విద్యార్థులు తమ ఇళ్లల్లో, గ్రామాల్లో కూడా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా అవగాహన కల్పించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకు రాగలరని అక్షర స్కూల్ గ్రీన్ కమిటీ సభ్యులు శ్రీకాంత్ రెడ్డి, కృష్ణ కాంత్ తెలిపారు. ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలన పై ప్రజల్లో అవగాహనను కల్పించారు."క్లీన్ క్యాంపస్... గ్రీన్ ఫ్యూచర్... బెటర్ టుమారో"అనే సందేశం తో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని క్లబ్ పి ఆర్ ఓ లయన్ పాష తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమేష్ ,రాధిక,అఖిల,స్వాతి, లయన్స్ క్లబ్ సభ్యులు మోహన్ రెడ్డి,సునంద, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# శారీరక దృఢత్వం పోలీసింగ్‌కు పునాది






### ప్రజాసేవలో ఉత్తమ ఫలితాలకు క్రమశిక్షణ తప్పనిసరి
### అంకితభావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి
### వారాంతపు కవాతు నందు హాజరైన జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్

**మిడ్జిల్, ఆగస్టు 01, జర్నలిస్ట్ డైరీ.**
మహబూబ్ నగర్ జిల్లా పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ శారీరకంగా దృఢంగా, మానసికంగా అప్రమత్తంగా ఉండి క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ సూచించారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కవాతు మైదానంలో నిర్వహించిన వారాంతపు కవాతుకు జిల్లా ఎస్పీ హాజరై పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కవాతులో పాల్గొన్న అధికారులు, పోలీసు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. పోలీసు విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని, వాటిని సమర్థవంతంగా నిర్వర్తించేందుకు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, అప్రమత్తత అత్యంత అవసరమని ఎస్పీ తెలిపారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రతిరోజూ వ్యాయామం, పరేడ్, ఫిట్‌నెస్ కార్యక్రమాల్లో క్రమం తప్పకుండా పాల్గొని తమ శారీరక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించాలంటే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దృఢత్వం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో సమయపాలన, అంకితభావం, నిజాయితీ, క్రమశిక్షణను పాటిస్తూ ప్రజలతో స్నేహపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి పోలీసు సిబ్బంది తమ సేవల ద్వారా శాఖ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎన్.బి.రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణా రెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, రూరల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బస్సు ఎక్కుతున్న వారే టార్గెట్
### ముగ్గురు జేబు దొంగలు అరెస్ట్



**నాగోల్, ఆగస్టు01 జర్నలిస్ట్ డైరీ.**
బస్సు ఎక్కే ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని సెల్‌ఫోన్లు అపహరిస్తున్న ముగ్గురు అలవాటు నేరస్తులను నాగోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఒక ఐఫోన్, ఒక మోటరోలా సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని న్యాయస్థానంలో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. జూలై 31న నాగోల్ చౌరస్తాలోని బస్‌స్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న నారాయణ రాజ్‌కుమార్, వెంకటాచారి బస్సు ఎక్కుతున్న సమయంలో కావడి శివ (22) వారిని మాటల్లో పెట్టి దృష్టి మరల్చగా, అతనితో పాటు ఉన్న మేకల జగపతి బాబు అలియాస్ జగపతి, బోయ అలియాస్ గారడీ మంజునాథ్ అలియాస్ మంజు వారి జేబుల్లోని రెండు సెల్‌ఫోన్లను అపహరించి పరారయ్యారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన నాగోల్ పోలీసులు ఆగస్టు 1న నాగోల్ చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి దొంగిలించిన రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ప్రధాన నిందితుడు మేకల జగపతి బాబుపై వివిధ పోలీస్‌స్టేషన్లలో 7 సెల్‌ఫోన్ చోరీ కేసులు, బోయ అలియాస్ గారడీ మంజునాథ్‌పై 4 చోరీ కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు నాగోల్ పోలీసులు తెలిపారు.

## బోనాల ఉత్సవాలకు చెక్కుల పంపిణీ

### ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డితో పాటు పాల్గొన్న కె ఎల్ ఆర్
### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాలు ప్రతీక: కిచ్చెన్న



**మహేశ్వరం, ఆగస్టు1 జర్నలిస్ట్ డైరీ.**
జిహెచ్ఎంసి డివిజన్ జిల్లెలగూడ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బోనాల ఉత్సవాల చెక్కులను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డితో కలిసి మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్న లక్ష్మారెడ్డి.. ఆలయ కమిటీలకు అందజేశారు. ఈ సందర్భంగా కె ఎల్ ఆర్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే అమ్మవారి బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు రూ. 17.50 లక్షలకు పైగా సీఎం రేవంత్ రెడ్డి మన నియోజకవర్గానికి నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. భవిష్యత్ తరాలకు బోనాల ఉత్సవాల గురించి తెలిసేలా ప్రతీ ఆడబిడ్డ కృషి చేయాలని.. ఆలయాల కమిటీలు సమన్వయం చేసుకోవాలని లక్ష్మారెడ్డి సూచించారు. బోనాల పండుగ ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో ఆలయాలు పరిశీలన చేయాలని కిచ్చెన్న కోరారు. అంతకు ముందు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ యువ సేన ఆధ్వర్యంలో సీడీ ఆవిష్కరించారు.

## బిజినెస్

# జూలైలో రూ.2 లక్షల కోట్లు దాటిన జీఎస్టీ కలెక్షన్లు..

### -15.4 శాతం పెరుగుదల




: జూలై నెలకు సంబంధించిన గూడ్స్ అండ్స్ సర్వీస్ ట్యాక్స్ (జీఎస్టీ) వసూళ్ల వివరాలు వెల్లడించింది కేంద్రం. జూలైలో రూ.2.11 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్లు కేంద్రం ప్రకటించింది. ఇందులో సెంట్రల్ జీఎస్టీ (సీజీఎస్టీ) వసూళ్లు రూ.39,835 కోట్లు, స్టేట్ జీఎస్టీ (ఎస్‌జీఎస్టీ) వసూళ్లు రూ.47,881 కోట్లుకాగా ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (ఐజీఎస్టీ) వసూళ్లు రూ.1.23 లక్షలుగా ఉన్నాయి. ఏడాది ప్రాతిపదికన చూస్తే గతేడాది ఇదే నెలకు సంబంధించి జీఎస్టీ వసూళ్లలో 15.4 శాతం పెరుగుదల ఉంది. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.2 లక్షల కోట్ల జీఎస్టీ వసూలు కావడం ఇది రెండోసారి.చివరగా గత ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.2.43 లక్షల కోట్లు వచ్చాయి. ఈ వివరాల్ని కేంద్ర ఆర్థిక శాఖ శనివారం, ఆగష్టు 1న విడుదల చేసింది. జూలై నెలకు సంబంధించి రీఫండ్‌లు కూడా 13.1 శాతం పెరిగి, రూ.29,968 కోట్లకు చేరాయి. విదేశీ దిగుమతుల ద్వారా జీఎస్టీ రెవెన్యూ 28.8 శాతం పెరిగింది. వరుసగా జీఎస్టీ వసూళ్లు పెరుగుతుండటం దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సంకేతం అని నిపుణులు అంటున్నారు. జీఎస్టీ వసూళ్లలో హరియాణా అత్యధిక వృద్ధి సాధించింది. అదే సమయంలో గుజరాత్ రెండో స్థానంలో, తెలంగాణ కూడా భారీ వృద్ధి (19 శాతం) నమోదు చేసింది. మరోవైపు ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లపై ఆర్బీఐ అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్స్ అమలు చేయనున్నట్లు చెప్పింది.+వశీస్త్రతీఖజూష్ట్రఅఎ Reference దీనిప్రకారం.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (కమర్షియల్ బ్యాంక్స్-ఇంటరెస్ట్ రేట్ ఆన్ డిపాజిట్స్) సెకండ్ అమెండ్‌మెంట్ డైరెక్షన్స్, 2026 ప్రకారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏదైనా ఒక రోజున కస్టమర్లు డిపాజిట్ చేసే మొత్తాలకు, ఒక అమౌంట్‌కు అన్ని బ్రాంచులలో ఒకే వడ్డీ రేటు చెల్లించాలని ఆదేశించింది. బల్క్ డిపాజిట్లతోపాటు అన్ని రకాల డిపాజిట్లపై వేర్వేరు బ్రాంచుల్లో అయినా సరే ఒక అమౌంట్‌కు, ఒకే రకమైన వడ్డీ చెల్లించాలని, ఈ విషయంలో వివక్ష ఉండకూడదని కూడా ఆర్బీఐ ఆదేశించింది.

# జులైలో యూపీఐ లావాదేవీలకు కొత్త రికార్డు..

### - రూ.29.88 లక్షల కోట్ల విలువైన ట్రాన్సాక్షన్లు




దేశంలో డిజిటల్ చెల్లింపులు మరింత వేగంగా విస్తరిస్తున్నాయి. జులై నెలలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీలు సరికొత్త రికార్డు నమోదు చేశాయి. ఈ ఏడాది జులైలో మొత్తం 23.66 బిలియన్ యూపీఐ లావాదేవీలు జరిగాయని, వాటి విలువ రూ.29.88 లక్షల కోట్లుగా నమోదైందని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. గత ఏడాది జులైతో పోలిస్తే లావాదేవీల సంఖ్య 22 శాతం, మొత్తం విలువ 19 శాతం పెరిగినట్లు ఎన్‌పీసీఐ తెలిపింది. జులైలో రోజుకు సగటున 76.3 కోట్ల యూపీఐ లావాదేవీలు జరగగా, వాటి విలువ రూ.96,383 కోట్లుగా నమోదైంది. చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా యూపీఐ సేవలు వేగంగా విస్తరించడం, డిజిటల్ చెల్లింపులపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహన, స్మార్ట్‌ఫోన్ వినియోగం అధికం కావడం వల్లే ఈ స్థాయిలో లావాదేవీలు నమోదైనట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

# 3 నిమిషాల్లోనే అమ్ముడైన రాయల్ ఎన్ఫీల్డ్ స్పెషల్ ఎడిషన్ బైక్

రాయల్ ఎన్ఫీల్డ్ అభిమానులకు ప్రత్యేకంగా రూపొందించిన షాటగన్ 650 స్పెషల్ ఎడిషన్ బైక్‌కు ప్రపంచవ్యాప్తంగా విశేష స్పందన లభించింది. ఈ లిమిటెడ్ ఎడిషన్ మోడల్ విక్రయాలు ప్రారంభమైన కేవలం మూడు నిమిషాల్లోనే భారత మార్కెట్‌కు కేటాయించిన 25 బైక్‌లు పూర్తిగా అమ్ముడయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా కేవలం 100 యూనిట్లను మాత్రమే తయారు చేసిన ఈ ప్రత్యేక మోడల్‌ను తైవాన్‌కు చెందిన ప్రముఖ కస్టమ్ మోటార్‌సైకిల్ బ్రాండ్ ఐకాన్ మోటార్‌స్పోర్ట్స్ సహకారంతో ప్రత్యేకంగా డిజైన్ చేశారు. ఈ స్పెషల్ ఎడిషన్ బైక్‌కు ప్రీమియం బ్లాక్ కలర్, ఆకర్షణీయమైన గోల్డ్ స్ట్రైప్స్, అలాగే ప్రతి బైక్‌కు ప్రత్యేక సీరియల్ నంబర్ అందించారు. దీంతో ఇది కలెక్టర్స్ ఎడిషన్‌గా మరింత ప్రత్యేకతను




సంతరించుకుంది. ఇంజిన్ పరంగా ఎలాంటి మార్పులు చేయలేదు. ఇందులో సాధారణ షాట గన్ 650లో ఉండే 648 సీసీ, ప్యారలల్-ట్విన్ ఇంజిన్నే కొనసాగించారు. ఈ ఇంజిన్ శక్తివంతమైన పనితీరుతో పాటు సాఫీ రైడింగ్ అనుభవాన్ని అందిస్తుంది.పరిమిత సంఖ్యలో విడుదల చేయడం, ప్రత్యేక డిజైన్, ప్రీమియం ఫినిషింగ్ కారణంగా ఈ స్పెషల్ ఎడిషన్ బైక్‌కు మార్కెట్లో భారీ డిమాండ్ ఏర్పడిందని కంపెనీ వర్గాలు తెలిపాయి.

---

### సెంట్రల్ జోన్ సారథిగా పాటిదార్..

# స్క్వాడ్‌లో రింకూ, దూబే..!

ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును వరసగా రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిపిన రజత్ పాటిదార్ దేశవాళీ క్రికెట్లో బిజీ కానున్నాడు. త్వరలో మొదలయ్యే దులీప్ ట్రోఫీ లో పాటిదార్ సెంట్రల్ జోన్‌ను నడిపించాడు. ఈ ఐపీఎల్ విజేతను కెప్టెన్‌గా 15 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించారు సెలెక్టర్లు. టీ20 చిచ్చరపిడుగు రింకూ సింగ్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు.దేశవాళీ సీజన్ 2026-27లో మొదటిదైన దులీప్ ట్రోఫీకి తెరలేవనుంది. ఇప్పటికే ఈస్ట్ జోన్, వెస్ట్ జోన్ తమస్క్వాడ్‌ను ప్రకటించాయి. శనివారం సెంట్రల్ జోన్ సెలెక్టర్లు ఐపీఎల్ విన్నర్ రజత్ పాటిదార్ కెప్టెన్‌గా పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేశారు. రింకూ సింగ్‌కు వైస్ కెప్టెన్సీ అప్పగించిన సెలెక్టర్లు.. ఇటీవలే టీ20ల్లో అరంగేట్రం చేసిన యశ్ ఠాకూర్‌ను పేస్ దళంలోకి తీసుకున్నారు.శ్రీలంక పర్యటనకు ఎంపికైన సరాన్ష్ జైన్ ఆల్‌రౌండర్ కోటాలో చోటు దక్కించుకోగా.. వికెట్ కీపర్లుగా ఆర్యన్ జుయల్, కునాల్ సింగ్




రాథోడ్ స్క్వాడ్‌లోకి వచ్చారు. స్పిన్నర్ హర్ష్ దూబే కూడా 15మందిలో స్థానం సంపాదించాడు. జూలై 31న ఉజ్జయిని దేవాలయంలో మహాకాళేశ్వరుడిని కుటుంబం సమేతంగా దర్శించుకున్నాడు పాటిదార్.ఆగస్టు 23 నుంచి బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆగస్టు 23న దులీప్ ట్రోఫీ మొదలవ్వనుంది. డిఫెండింగ్ ఛాంపియనైన సెంట్రల్ జోన్ నేరుగా సెమీఫైనల్ ఆడనుంది. ఈస్ట్ జోన్, నార్త్ ఈస్ట్ జోన్ మ్యాచ్ విజేతను ఆగస్టు 30న పాటిదార్ సేన ఢీకొట్టనుంది. సెప్టెంబర్ 6వ తేదీన ఫైనల్ జరుగనుంది.

**సెంట్రల్ జోన్ స్క్వాడ్:** రజత్ పాటిదార్(కెప్టెన్), ఆర్యన్ జుయల్(వికెట్ కీపర్), సరాన్ష్ జైన్, అమన్ మొఖడె, కునాల్ ఛండేలా, జీషన్ అన్సారీ, ఆర్యన్ పాండే, అర్షద్ ఖాన్, రింకూ సింగ్(వైస్ కెపట్?న్), ఆయుష్ పాండే, యశ్ రాథోడ్, హర్ష్ దూబే, కునాల్ సింగ్ రాథోడ్(వికెట్ కీపర్), యశ్ ఠాకూర్, నచికెట్ భుటే.

# జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రాకు సిల్వర్..

### - యశ్వీర్ సింగ్‌కు కాంస్యం




గ్లాస్‌గో:
భారత జావెలిన్ స్టార్ త్రోయర్ నీరజ్ చోప్రా.. కామన్‌వెల్త్ క్రీడల్లో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఇదే ఈవెంట్‌లో మరో ఇండియన్ అథ్లెట్ యశ్వీర్ సింగ్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. తన చివరి త్రోతో యశ్వీర్ అనూహ్య రీతిలో మెడల్‌ను సొంతం చేసుకున్నాడు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన 28 ఏళ్ల నీరజ్ చోప్రా .. కామన్‌వెల్త్ గేమ్స్‌లో రెండో అటెంప్ట్‌లో 85.83 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరాడు. పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ నుంచి గట్టి పోటీ ఉంటుందని భావించారు. కానీ పాక్ అథ్లెట్ అనుకోని రీతిలో నిష్క్రమించాడు. ఇటీవల వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన శ్రీలంక అథ్లెట్ రుమేశ్ తరంగ పతిరగే సత్తా చాటాడు. అతను జావెలిన్‌ను 89.75 మీటర్ల దూరం విసిరి బంగారం పతకాన్ని కైవసం చేసుకున్నాడు.గ్లాస్‌గోలో ప్రస్తుతం చల్లని వాతావరణం ఉన్నది. బలమైన గాలులు కూడా వీస్తున్నాయి. ఇలాంటి వాతావరణంలో జావెలిన్‌ను సుమారు 90 మీటర్ల దూరం వరకు విసరడం అంత సులువైన అంశం కాదు. ఈ సీజన్‌లో జావెలిన్‌ను 90 మీటర్ల మార్క్ దాటించిన ఏకైక క్రీడాకారుడి జాబితాలో రుమేశ్ తరంగ ఉన్నాడు. ఇక ఈవెంట్‌లో 24 ఏళ్ల యశ్వీర్ అసాధారణ ప్రతిభ కనబరిచాడు. తొలిసారి కామన్‌వెల్త్ గేమ్స్ ఆడుతున్న అతను.. అందర్నీ స్టన్ చేస్తూ తన జావెలిన్‌ను 85.41 మీటర్ల దూరం విసిరాడు. తన చివరి ఆరో ప్రయత్నంలో అతను ఆ దూరానికి జావెలిన్‌ను విసిరి ఇండియాకు పతకాల సంఖ్యను పెంచేశాడు.

## స్పోర్ట్స్

### ఆగస్టు 4న శ్రీలంకకు

# టీమిండియా..

### -ప్రాక్టీస్ మ్యాచ్ షెడ్యూల్ కుదింపు..!



ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27లో కీలకమైన పర్యనటకు సిద్ధమవుతోంది టీమిండియా. రెండు టెస్టుల సిరీస్ కోసం భారత జట్టు ఆగస్టు 4వ తేదీన శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. తొలి టెస్టుకు ముందు శుభ్‌మన్ గిల్ సేన నాలుగు రోజులు ప్రాక్టీస్ మ్యాచ్ ఆడాల్సి ఉంది. అయితే.. అనుకోని కారణాల వల్ల షెడ్యూల్ మారింది. నాలుగు రోజుల కాస్త మూడు రోజులకు మారింది. ఇందుకు కారణం ఏంటనేది మాత్రం తెలియాల్సి ఉంది.శ్రీలంక పర్యటనకు భారత స్క్వాడ్ ప్రకటన సమయంలోనే నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఉంటుందని బీసీసీఐ తెలిపింది. అయితే.. ఇప్పుడు షెడ్యూల్‌లో మార్పులు చేశామని, ప్రాక్టీస్ మ్యాచ్ మూడు రోజులకే పరిమితం కానుందని సమాచారం. షెడ్యూల్ ఎందుకు మారింది? అనేది మాత్రం తెలియడం లేదు. శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతం గంభీర్ బృందం ఆగస్టు 4న శ్రీలంకకు వెళ్లనుంది. మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ అనంతరం తొలి టెస్టుకోసం భారత జట్టు గాలే చేరుకోనుంది.
ఆగస్టు 15 వ తేదీన గాలే స్టేడియంలో మొదటి టెస్టు.. ఆపై ఆగస్టు 23న కొలంబోలో రెండో టెస్టులో ఇరుజట్లు తలపడనున్నాయి. ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్(ఔఠజ) ర్యాంకింగ్స్‌లో 5వ స్థానంలో ఉన్న గిల్ సేన.. ఈ రెండు మ్యాచుల్లో గెలిచినా టాప్-2లోకి వచ్చే అవకాశాలు తక్కువే. ఇంగ్లండ్ పర్యటనలో గాయపడిన ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ పరీక్షలో పాసవ్వడం భారత పేస్ బలాన్ని పెంచనుంది. అయితే.. గాయం నుంచి కోలుకుంటున్న సాయి సుదర్శన్ ఈ టెస్టు సిరీస్‌కు అందుబాటులో ఉంటాడా? లేదా? అనేది తెలియాల్సి ఉంది.

**భారత టెస్టు స్క్వాడ్ :** శుభ్‌మన్ గిల్(కెప్టెన్), కేఎల్ రాహుల్(వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, రిషభ్ పంత్(వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవ్‌దత్ పడిక్కల్, సరాన్ష్ జైన్.

# కొరియన్ కనకరాజు' ట్రైలర్ అదిరింది..

-డ్యూయల్ షేడ్స్, కామెడీతో అంచనాలు పెంచిన వరుణ్




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కిస్తున్న ఇండో-కొరియన్ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ కొరియన్ కనకరాజు పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్, పాటలు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని కలిగించగా.. తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఉన్న హైప్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. తాజా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. ఈ సినిమా పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందినట్లు తెలుస్తోంది. అనంతపురానికి చెందిన ఓ సాధారణ యువకుడు, కొరియన్ మాఫియా ప్రపంచం మధ్య జరిగే ఆసక్తికర పరిణామాలే కథకు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. హారర్, కామెడీ, యాక్షన్ అంశాలను దర్శకుడు మేర్లపాక గాంధీ వినోదాత్మకంగా రూపొందించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ రెండు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నట్లు ట్రైలర్ సూచిస్తోంది. ఒకవైపు అనంతపురం యువకుడిగా మాస్ బాడీ లాంగ్వేజ్‌తో అలరిస్తూనే, మరోవైపు కొరియన్ మాఫియా డాన్ పాత్రలో స్టైలిష్ లుక్, స్వాగ్‌తో ఆకట్టుకున్నారు. రెండు పాత్రలకు భిన్నమైన హావభావాలు, బాడీ లాంగ్వేజ్, మేకోవర్‌తో వరుణ్ తేజ్ చూపించిన వైవిధ్యం అభిమానులను ఆకట్టుకుంటోంది. ట్రైలర్‌లో నటుడు సత్య చెప్పిన పంచ్ డైలాగులు నవ్వులు పూయిస్తున్నాయి. ఆయన కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ట్రైలర్‌ను చూసిన ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. హీరోయిన్ రిథికా నాయక్ తన గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు మంచి ఆదరణ పొందగా, ట్రైలర్‌లో ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరింత ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా యాక్షన్, హారర్ సన్నివేశాల్లో థమన్ సంగీతం సినిమాకు అదనపు బలంగా కనిపిస్తోంది. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ట్రైలర్‌లో కనిపించిన విజువల్స్, సెట్స్, సాంకేతిక నాణ్యత సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలియజేస్తున్నాయి. ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న 'కొరియన్ కనకరాజు' ఇప్పటికే మంచి పాజిటివ్ బజ్‌ను సొంతం చేసుకుంది. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి. హారర్, కామెడీ, యాక్షన్, ఎమోషన్‌లతో కూడిన పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ట్రైలర్‌కు వస్తున్న స్పందన చూస్తుంటే.. వరుణ్ తేజ్ ఖాతాలో మరో విజయవంతమైన చిత్రం చేరే అవకాశాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# టాక్సిక్' ట్రైలర్ డేట్ ఫిక్స్..

-బాక్సాఫీస్ పై యష్ సునామీ!



కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్డేట్ అందించారు. సినిమా ప్రమోషన్స్ లో భాగంగా చిత్ర యూనిట్ తాజాగా ట్రైలర్ రిలీజ్ డేట్ ను అధికారికంగా ప్రకటించడంతో పాటు, ఒక సరికొత్త పోస్టర్ ను విడుదల చేసి సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చారు. గీతూ మోహన్ దాస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ సాలిడ్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే సినీ వర్గాలలో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. రీసెంట్ గా రామాయణ ప్రాజెక్ట్ తో పాటు రావణాసురుడి పాత్రలో యష్ గెటప్ మరియు ప్రెజెన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ సినిమా కంటే ముందే బాక్సాఫీస్ ముందుకు రాబోతున్న 'టాక్సిక్' తో యష్ ఏ స్థాయిలో విధ్వంసం సృష్టిస్తాడనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో తాజాగా విడుదల చేసిన బ్లాక్ అండ్ వైట్ పోస్టర్ సినిమా మూడ్ ఏంటో స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ పోస్టర్ తో పాటు మేకర్స్ అనౌన్స్ చేసిన వివరాల ప్రకారం, ఈ భారీ బడ్జెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమా ట్రైలర్ ను వచ్చే ఆగస్టు 8, 2026 న అత్యంత గ్రాండ్ గా లాంచ్ చేయనున్నారు. ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి వంటి స్టార్ హీరోయిన్లు, నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ మరియు మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్ తో ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇక కేజీఎఫ్ లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత కేవీఎన్ ప్రొడక్షన్స్ తో యష్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్ పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి.



# నీట్ పేపర్ లీక్ వల్ల సర్వస్వాన్ని కోల్పోయాను

-నటి మానుషి చిల్లర్

మాజీ ప్రపంచ సుందరి, బాలీవుడ్ నటి మానుషి చిల్లర్ తన విద్యార్థి దశలో నీట్ పేపర్ లీక్ అవ్వడం వలన పడ్డ కష్టాలను గుర్తుచేసుకుంటూ ఆసక్తికర విషయాలను పంచుకుంది. సోహా అలీ ఖాన్ నిర్వహించిన 'ఆల్ అబౌట్ హర్' యూట్యూబ్ టాక్ షోలో పాల్గొన్న ఆమె, 2015 నాటి వైద్య ప్రవేశ పరీక్ష (నీట్) పేపర్ లీక్ ఉదంతం తనపై ఎంత తీవ్రమైన మానసిక ప్రభావాన్ని చూపిందో వివరించారు. ఎంతో కష్టపడి ప్రిపేర్ అయిన తర్వాత పరీక్ష రద్దు కావడం, మళ్లీ రాయాల్సి రావడం తన జీవితంలోనే అత్యంత కఠినమైన కాలమని ఆమె తెలిపారు. వైద్య వృత్తిపై మక్కువతో తాను ఎంతో ఇష్టపడే కూచిపూడి నృత్యం, పెయింటింగ్ వంటి వాటిని ఒక సంవత్సర కాలం పాటు పూర్తిగా పక్కన పెట్టానని, తన సంతోషాలన్నింటినీ త్యాగం చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ డాక్టర్లు కావడంతో మానసికంగా తనకు ఎంతో అండగా నిలిచారని, అయితే సాధారణ విద్యార్థులు పడే ఇబ్బందులను తాను ప్రత్యక్షంగా చూశానని మానుషి వెల్లడించారు. ఎంతోమంది విద్యార్థులు కోచింగ్ కోసం అప్పులు చేసి, వేరే నగరాలకు వెళ్లి చదువుకుంటున్నారని, అలాంటి సమయంలో పరీక్ష మళ్లీ రాయాల్సి రావడం వల్ల విద్యార్థులు ఎంతటి మానసిక ఒత్తిడికి గురవుతారో మాటల్లో చెప్పలేమని అన్నారు. పరీక్ష తేదీ పొడిగించిన ఆ 45 రోజులు మరింత కష్టంగా మారిందని, ఇంకెంత శక్తి మిగిలి ఉందో అనిపించేదని ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే తన తల్లిదండ్రులు రోజుకో గంట వ్యాయామం, బాస్కెట్‌బాల్ ఆడటం వంటి వాటికి కేటాయించాలని చెప్పడం వల్లే తాను డిప్రెషన్‌లోకి వెళ్లకుండా మానసిక ప్రశాంతతను కాపాడుకోగలిగానని తెలిపారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత మిస్ వరల్డ్ 2017 కిరీటాన్ని గెలుచుకున్న మానుషి, ఆ తర్వాత అనూహ్యంగా సినిమాల్లోకి ప్రవేశించారు. 'సమ్రాట్ పృథ్విరాజ్' చిత్రంతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఆమె, ఆ తర్వాత 'ది గ్రేట్ ఇండియన్ ఫ్యామిలీ', 'ఆపరేషన్ వాలెంటైన్' వంటి చిత్రాలతో నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

# రజనీకాంత్ నుంచి రాశీ ఖన్నాకు స్పెషల్ గిఫ్ట్..

-తలైవా సర్‌ప్రైజ్‌తో ఎమోషనల్ అయిన హీరోయిన్!



సూపర్ స్టార్ రజనీకాంత్‌తో కలిసి నటించే అవకాశం రావడం ఏ నటుడికైనా, నటికైనా ప్రత్యేకమైన అనుభవమే. అలాంటి అవకాశం దక్కిన హీరోయిన్ రాశీ ఖన్నాకు షూటింగ్ ప్రారంభమైన కొద్ది రోజులకే తలైవా నుంచి ఊహించని బహుమతి అందింది. రజనీకాంత్ స్వయంగా ఓ ఆధ్యాత్మిక పుస్తకాన్ని ఆమెకు కానుకగా ఇవ్వడంతో రాశీ ఖన్నా ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకోవడంతో ప్రస్తుతం ఈ వార్త వైరల్‌గా మారింది. ప్రస్తుతం రజనీకాంత్ హీరోగా దర్శకుడు అశ్వత్ మారిముత్తు తెరకెక్కిస్తున్న 'ధర్మన్ -- ది డెడ్లీ డాక్టర్' చిత్రంలో రాశీ ఖన్నా కీలక పాత్రలో నటిస్తున్నారు. షూటింగ్ సందర్భంగా ఇద్దరి మధ్య ఆధ్యాత్మికత, జీవన విలువలపై ఆసక్తికర చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో రజనీకాంత్ ప్రముఖ ఆధ్యాత్మిక గ్రంథం 'హఆజఆఅస్త్ర షఱష్ట్ర ష్ట్రవ ఎఆమ్ఖిశ్రీఖిమ్ఖిఅ మ్ఖిర్‌వతీం' గురించి ప్రస్తావించారు. తాను ఇప్పటివరకు ఆ పుస్తకాన్ని చదవలేదని రాశీ చెప్పగా, రెండు రోజుల వ్యవధిలోనే ఆ పుస్తకాన్ని తెప్పించి స్వయంగా ఆమెకు బహుమతిగా అందించినట్లు సమాచారం. రజనీకాంత్ నుంచి ఈ ప్రత్యేక కానుక అందుకోవడంపై రాశీ ఖన్నా సోషల్ మీడియాలో భావోద్వేగంగా స్పందించారు. ఇది కేవలం ఒక పుస్తకం మాత్రమే కాదు... నా జీవితానికి ఒక నిశ్శబ్దమైన మార్గదర్శకం అంటూ ఆమె పేర్కొన్నారు. కొన్నిసార్లు పరిణతి అంటే కొత్తగా ఏదైనా సాధించడం కాదు.. మనం కాని వ్యక్తిగా నటించడం మానేసి, మన నిజమైన స్వరూపాన్ని అంగీకరించడం అనే భావాన్ని ప్రతిబింబించే కోట్‌ను కూడా ఆమె షేర్ చేశారు. స్తకం పూర్తిగా చదివానో లేదో తర్వాత పరీక్ష పెడతానని రజనీ సార్ చెప్పారు. అందుకే చాలా శ్రద్ధగా చదువుతున్నాను అంటూ అభిమానులతో ఆ అనుభవాన్ని పంచుకున్నారు. రజనీకాంత్ నటిస్తున్న 'ధర్మన్ -- ది డెడ్లీ డాక్టర్' చిత్రాన్ని ప్రముఖ నటుడు కమల్ హాసన్ తన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్లు ఇప్పటికే మంచి స్పందనను అందుకున్నాయి. రజనీకాంత్ కొత్త లుక్, కథాంశంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని 2027లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. రజనీకాంత్ లాంటి దిగ్గజ నటుడు తనపై చూపిన ఆప్యాయత, ఆధ్యాత్మిక పుస్తకాన్ని బహుమతిగా ఇవ్వడం తనకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవమని రాశీ ఖన్నా చెప్పడంతో, అభిమానులు తలైవా గొప్ప మనసును మరోసారి ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం రాశీ షేర్ చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

# ఇండియన్ బాక్సాఫీస్ వద్ద 'స్పైడర్ మ్యాన్' హవా

-రెండు రోజుల్లో రూ.131 కోట్లు..




హాలీవుడ్ స్టార్ హీరో టామ్ హాలండ్ ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ సూపర్ హీరో మూవీ 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ నివ్ డే' బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టిస్తోంది. డెస్టిన్ డేనియల్ క్రీటన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జెండాయా, జాకబ్ బటాలాన్, సాడీ సింక్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ప్రపంచవ్యాప్త విడుదలకు ముందే భారత్‌లో గురువారమే విడుదలైన ఈ సినిమా, కేవలం రెండు రోజుల్లోనే రూ. 100 కోట్లకు పైగా వసూళ్లను సాధించి అదరగొట్టింది. చిత్ర నిర్మాత ప్రకటించిన నివేదిక ప్రకారం.. ఈ సినిమా మొదటి రోజు రూ. 72.44 కోట్ల గ్రాస్ కలెక్షన్లను రాబట్టగా, రెండో రోజు రూ. 59.02 కోట్లు వసూలు చేసింది. దీంతో మొత్తంగా భారత్ బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం రూ. 131.46 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని దాటింది. ఇంగ్లీష్‌తో పాటు హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 2డి, 3డి ఫార్మాట్లలో విడుదలైన ఈ చిత్రానికి అన్ని ప్రాంతాల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465